PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 46 | విజయవాడ, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 16 September 2024 | Rs

ఏటా వెంటాడుతున్న ముంపు

- డెల్టా రైతులకు కష్టాలు
- కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణలో నిర్లక్ష్యం
- భారీ వర్షాలతో 4 జిల్లాల్లో, 4 లక్షల ఎకరాల్లో ముంపు

3



ఇండియా - 'ఎ' జయభేరి

186 పరుగుల తేడాతో ఇండియా - డిపై విజయం

సెంచరీతో తెలుగుతేజం రిక్కీ భుయ్ సూపర్ ఇన్నింగ్స్

2

ముగ్గురు సీనియర్ ఐపిఎస్‌లపై వేటు

పిఎస్‌ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్‌గున్ని సస్పెన్షన్

నటి జత్వానీ అరెస్ట్ వ్యవహారంలో ప్రభుత్వ ఆదేశాలు



పిఎస్‌ఆర్ ఆంజనేయులు



కాంతిరాణా టాటా



విశాల్ గున్నీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముంబై నటి కాదంబరీ జెత్వాని కేసులో రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంతో ప్రమేయం ఉందన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ముగ్గురు సీనియర్ ఐపిఎస్ అధికారులపై వేటు వేసింది. ప్రస్తుతం వెయిటింగ్‌లో వున్న మాజీ ఇంటలిజెన్స్ చీఫ్ పిఎస్‌ఆర్ ఆంజనేయులు, మాజీ విజయవాడ సిటీ పోలీస్‌కమిషనర్ కాంతిరాణా టాటా, మాజీ విజయవాడ డిసిపి విశాల్ గున్నిను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జిఓ నంబర్ 1590, 1591,1592ను ఆదివారం విడుదల చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఇబ్రహీంపట్నం సిఐ సత్యనారాయణ, ఎసిపి హనుమంతరావులను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర డిజిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వైసిపి నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా తనపై అన్యాయంగా కేసు పెట్టి, తల్లిదండ్రులను అరెస్టు చేశారని నటి జత్వానీ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఒక పారిశ్రామికవేత్తపై ముంబయిలో తాను పెట్టిన కేసును వెనక్కి తీసుకునేలా చేసేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే ముంబాయిలో వున్న తనను 7.30 గంటలకు తల్లిదండ్రులతోపాటు అరెస్టు చేయడం కుట్రలో భాగమేనని ఆమె తెలిపారు. పిఎస్‌ఆర్ ఆంజనేయులు నేతృత్వంలోనే తనను అక్రమంగా నిర్బంధించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యాసాగర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, తనను వేధించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకొని తనకు, తన కుటుంబ సభ్యులకు పోలీసు రక్షణ కల్పించాలని కాదంబరి జెత్వాని ఫిర్యాదులో వివరించారు. ఐపిఎస్ అధికారులపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారంపై విచారణకు డిజిపి తిరుమల రావు ఆదేశించారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు జరిపిన విచారణలో ఈ వ్యవహారంలో అనేక లొసుగులు బయటపడ్డాయి. ఈ మేరకు ఆయన నివేదిక రూపొందించి డిజిపికి అందజేశారు. దీని ఆధారంగా డిజిపి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఉన్నతస్థాయిలో ఉన్న ఐపిఎస్ అధికారులు అధికార దుర్వినియోగానికి ఎలా పాల్పడ్డారో వివరించారు. రాష్ట్రప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆ అంశాలనే పేర్కొంటూ ఒక్కో అధికారి పేరుతో విడివిడిగా జిఓలు జారీ చేసింది. పిఎస్‌ఆర్ ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ జారీ చేసిన జిఓలో ఆయన జనవరి 31న విజయవాడ సిటి కమిషనర్ కాంతిరాణా టాటా, డిసిపి విశాల్‌గున్నిని సిఎంఓకు పిలిపించి ముంబాయిలో వున్న సినీనటి కాదంబరి జత్వానిని అరెస్ట్ చేయాల్సిందిగా, మౌఖికంగా ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఆయన పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు జిఓలో తెలిపారు. 'ఆధారాలు లేకుండా, అసంపూర్తిగా ఉన్న ఫిర్యాదును ఆధారంగా తన ఉద్యోగ హోదాను అడ్డుపెట్టుకుని ఆదేశాలు జారీ చేశారు' అని పేర్కొన్నారు. అలాగే కాంతిరాణా టాటా పోలీస్ కమిషనర్‌గా ఇంటలిజెన్స్ చీఫ్ నుండి ఆదేశాలు రాగానే ఎలాంటి ప్రాథమిక విచారణ చేయకుండా అరెస్ట్ చేయడాన్ని మరో జిఓలో తప్పుపట్టింది. 2వ తేది నమోదైన ఈ కేసులో జెత్వానిని అరెస్ట్ చేసేందుకు పోలీస్‌కమిషనర్ క్యాంప్‌క్లర్క్ ఫిబ్రవరి ఒకటో తేదీనే ముంబాయికి విమానం టికెట్‌లను బుక్ చేసిన విషయాన్ని కూడా ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది. కమిషనర్ కాంతిరాణా టాటా ఓరల్ ఆదేశాల మేరకు డిసిపి విశాల్‌గున్నికి, అడిషనల్ కమిషనర్ రమణమూర్తిలకు, సిఐలు శ్రీధర్, షరీఫ్, సత్యనారాయణ, ఆర్ఎస్ఐ దుర్గాదేవి, కానిస్టేబుళ్లు టి మౌనిక, వై రమేష్, ఎం గీతాంజలి, ఎస్ రమ్యలకు విమాన టికెట్‌లను ఎఫ్ఐఆర్ కాకముందు తీసుకున్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్నతాధికారుల అనుమతులు కూడా లేవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జెత్వాని కేసులో సీతారామాంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్‌గున్నిలు 'నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. బాధితురాలిని వేధించినట్లు తేలింది' అని ప్రభుత్వం ఉతర్వుల్లో పేర్కొంది. ఆ కారణంగానే క్రమశిక్షణా చర్యల కింద వీరు ముగ్గురిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. నటి జెత్వానిని వేదించి అక్రమంగా అరెస్ట్ చేసిన కేసులో మొత్తం 15 మంది పోలీస్ అధికారులు వున్నట్లు వివరించింది. ఇప్పటికే ఐదుగురిపై చర్యలు తీసుకోగా మిగలిన 10 మంది పోలీస్ అధికారులపై చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం పోతోంది.

47 మంది డిఎస్‌పిల బదిలీ 2

రెండ్రోజుల్లో రాజీనామా

- ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ ప్రకటన
- నవంబర్‌లోనే అసెంబ్లీ ఎన్నికలకు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రెండ్రోజుల్లో రాజీనామా చేస్తానని ఆమాద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ప్రకటించారు. తాను నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు, నిజాయితీపరుడినని ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చేవరకూ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టబోనని ఆయన చెప్పారు. కేజ్రీవాల్ అమాయాకుడా..? దోషా..? అని తాను ఢిల్లీ ప్రజలను అడగదలుచుకున్నానని తెలిపారు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడంతో ఆరు నెలల తరువాత శుక్రవారం ఆయన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆదివారం నాడిక్కడ ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు. ఫిబ్రవరిలో ఢిల్లీ ఎన్నికలు జరగాల్సి ఉందని, అయితే మహారాష్ట్రతో పాటు నవంబర్‌లోనే ఢిల్లీకి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా ఆశీర్వాదంతో బిజెపి కుట్రలన్నింటినీ తిప్పికొట్టే శక్తి తమకుందని చెప్పారు. బిజెపికి నిజాయితీ లేదని, అందుకే ఆ పార్టీ వాళ్లు నిజాయితీకి భయపడుతున్నారన్నారు. 'డబ్బు నుంచి అధికారం, అధికారం నుంచి డబ్బు' అనే ఆటలో తాను భాగం కాలేదన్నారు. కోర్టుల ద్వారానే తనకు న్యాయం జరిగిందని చెప్పారు. ప్రజా న్యాయస్థానం కూడా తమకు న్యాయం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్వతంత్ర సమరయోధులను బంధించిన ఆంగ్లేయులు అప్పట్లో సహచరులను కలుసుకునేందుకు వీలుకల్పించారని, కానీ మోడీ సర్కార్ తనకు తన మిత్రులను జైలులో ములాకత్ అవ్వడానికి కూడా అనుమతించకుండా వేధింపులకు గురి చేసిందన్నారు. జైల్లో ఉన్న ఆప్ నాయకులు సత్యేందర్ జైన్, అమానతుల్లా బయటకు వస్తారని ఆశిస్తున్నట్లు కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ నూతన సిఎంను ఎన్నుకునేందుకు ఆప్ ఎమ్మెల్యేలతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.



మహా ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

'ఉక్కు' రక్షణకు మోడీ ప్రభుత్వాన్ని నిలదీయండి

- టిడిపి, జనసేనలకు సిపిఎం డిమాండ్
- పాత గాజువాకలో మహాధర్నా

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

ఎన్నికల్లో హామి ఇచ్చిన విధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని టిడిపి, జనసేనలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన పాత గాజువాక జంక్షన్‌లో ఆదివారం మహా ధర్నా జరిగింది. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ స్టీల్ జోన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిధిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రోజురోజుకూ ధ్వంసం చేస్తోందని అన్నారు. ప్లాంటును కావాలనే నష్టాల్లోకి నెట్టి ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టే కుట్రలు పన్నుతోందని చెప్పారు. ప్లాంట్ పూర్తిగా మునిగిపోకముందే టిడిపి, జనసేనలు కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని నిలదీసి ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించాలన్నారు. తమకు అధికారం ఇస్తే స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపి, అభివృద్ధి పథంలో నడిపిస్తామని కేంద్ర బిజెపి, రాష్ట్ర టిడిపి, జనసేన కూటమి పార్టీలు ఎన్నికల్లో వాగ్దానం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికారం చేపట్టాక మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కును రోజురోజుకూ అగాధంలోకి నెడుతుంటే టిడిపి, జనసేనలు చోద్యం చూడడం దుర్మార్గమన్నారు. 32 మంది ప్రాణ బలిదానం, అశేష త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును తెగ నమ్మితే ప్రజలు చూస్తూ ఊరుకోరని, తగిన శాస్తి చెబుతారని హెచ్చరించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపకపోతే తన పదవికి రాజీనామా చేసి పోరాటంలోకి దిగుతానని గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారని, రాజీనామా చేయడానికి ఆయన్ని ప్రజలు గెలిపించలేదని అన్నారు. అటువంటి ప్రకటనలను స్టీల్ కార్మికులు, ప్రజలు విశ్వసించరని అన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ఆర్థికంగా దెబ్బతీస్తోందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ పాలనకు టిడిపి, జనసేనలు ఆక్సిజన్ అందిస్తు న్నాయని, వారి మద్దతు లేకుండా మోడీ ప్రభుత్వం మనుగడ సాగించలేదని, అంతటి కీలక స్థితిలో ఉండి కూడా స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్రాన్ని ఎందుకు నిల దీయడం లేదని ప్రశ్నించారు. ప్లాంటును కేంద్రం ముంచేస్తుం టే ఇప్పుడు నిలువరించకుండా మిగతా 2లో



గండి పూడుస్తున్న దృశ్యం

ఏలేరు కాలువకు గండి

- నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి వద్ద ఏలేరు కాలువకు గండిపడింది. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు గట్లు బలహీనపడడం, అంతకుముందు నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆదివారం తెల్లవారుజామున కాలువ గట్టు లోపల భాగం కుమిలి గండిపడి జాగరాల గెడ్డలోకి నీరు ప్రవహిస్తోంది. అప్రమత్తమైన నీటిపారుదల శాఖాధికారులు కాలువలో నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసి గట్టు పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఇసుక బస్తాలు అడ్డుగా వేశారు. ప్రొక్లయిన్‌తో పక్కనున్న మట్టితీసి గండిపడిన చోట వేశారు. కాలువలో నీరు తగ్గాక పూర్తి స్థాయిలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం నగరానికి తాగునీటి సమస్య లేకుండా గట్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు. కాలువకు గండిపడడంతో కింద ఉన్న పంట పొలాలు నీటమునిగి దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందారు. కాలువకు నీటి సరఫరా నిలిపివేయడంతో పొలాల్లోకి నీరు చేరలేదు. పల్లంగా ఉన్న చోట్ల ఏలేరు కాలువ గట్టు పటిష్టతపై దృష్టి పెట్టకపోవడంతో గట్లు గండ్లు పడడం, గట్టు లోపల భాగం కుమిలి నీరు కిందకు వెళ్లి కాలువ గట్లు దెబ్బతినడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. కాలువ రెండువైపులా బలహీనంగా ఉన్న గట్టు భాగాన్ని అధికారులు గుర్తించి పటిష్టం చేయాల్సి ఉంది.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

- 30 మందికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిది



నెల్లూరు జిల్లా మనుగోలు మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి బిసి కాలనీలో గణేష్ విగ్రహం నిమజ్జన సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంలో బాణసంచా కాల్చారు. వీటి నిప్పురవ్వలు నిల్వ ఉంచిన బాణసంచాపై పడ్డాయి. దీంతో, బాణసంచా మొత్తం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. నిప్పురవ్వలు ఎగిసి పడడంతో 30 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాధితులను తిరుపతి జిల్లా గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా పోరాటాల ఛాంపియన్

- సోషలిస్టు శక్తులను ముందుకు నడిపారు
- సమాజ పురోభివృద్ధికి కృషి చేశారు
- ఏచూరికి ప్రపంచ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ఘన నివాళి



న్యూఢిల్లీ : ప్రజల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో సీతారాం ఏచూరి ఛాంపియన్‌గా నిలిచారని వివిధ దేశాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీల నేతలు నివాళులరించారు. ఈ మేరకు సిపిఎం కేంద్ర కార్యాలయానికి ఆ దేశాల నుండి సంతాప సందేశాలు పెద్ద ఎత్తున అందుతున్నాయి. భారత్‌లోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో జరుగుతున్న కార్మిక, ప్రజా పోరాటాలకు ఏచూరీ సంఘీభావం తెలిపి, అండగా ఉండేవారని ఈ సందేశాలలో ఆ నేతలు పేర్కొన్నారు. సోషలిస్టు దేశాలతో పాటు పాలస్తీనా, రష్యా, సిరియా రాయబారులు న్యూఢిల్లీలోని సిపిఎం కేంద్ర కార్యాలయాన్ని సందర్శించి ఏచూరి భౌతికకాయం వద్ద నివాళులు అర్పించిన విషయం తెలిసిందే. మరికొన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీల నేతలు ఆదివారం సంతాప సందేశాలు పంపారు. ప్రజల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో ఏచూరి ఛాంపియన్‌గా నిలిచారని వీరు పేర్కొన్నారు. నికరాగువా అధ్యక్షులు డేనియల్ ఆర్టెగా పంపిన సంతాపంలో ఏచూరి అంకితభావం అసమానమైనదని పేర్కొన్నారు 'చిత్తశుద్ధితో పనిచేసే వారు. న్యాయం కోసం, సత్యం కోసం, మానవ సమాజం కోసం ఎన్నో పోరాటాలు చేశారు' అని నివాళి అర్పించారు. పొలిసారియో ఫ్రంట్, సహ్రావీ రిపబ్లిక్ ప్రజల తరపున విదేశాంగ మంత్రి మహమ్మద్ సిదాతీ పంపిన సంతాప సందేశంలో సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఏచూరి అంకితభావం, సేవలు ప్రశంసనీయమన్నారు. అంతర్జాతీయంగా ప్రజా హక్కుల పరిరక్షణకు ఏచూరి సంఘీభావంగా నిలిచేవారని తెలిపారు. ఆయన పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవడాన్ని కర్తవ్యంగా తీసుకోవాలన్నారు.

అత్యుత్తమ నాయకుడు : చైనా కమ్యూనిస్టు పార్టీ

ఏచూరి అత్యుత్తమమైన నాయకుడని, మార్క్సిస్టు సిద్ధాంతకర్త అని చైనా కమ్యూనిస్టు పార్టీ తన సంతాప సందేశంలో పేర్కొంది. వామపక్ష ఉద్యమాన్ని, సోషలిస్టు శక్తులను ముందుకు నడిపించడంలో ఆయన ముఖ్య భూమిక పోషించారని, దేశాభివృద్ధి కోసం, సామాజిక పురోభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపింది. చైనా-భారత్ స్నేహంలో కూడా ఏచూరి పాత్ర ఉందని పేర్కొంది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా రాయబారి క్సు ఫైహాంగ్ కూడా చైనా రాయబార కార్యాలయం తరపున సంతాప సందేశం పంపారు.


క్యూబా సంఘీభావ ఉద్యమంలో కీలకపాత్ర

భారత్‌లో క్యూబా సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని క్యూబా కమ్యూనిస్టు పార్టీ (పిసిసి) పేర్కొంది. ఆ పార్టీ నేత ఎమిలియో లోజాడా గార్సియా ఈ మేరకు సంతాప సందేశం పంపారు. మన దేశంలోని మిగతా 2లో

మాటల్లోనే కేంద్రం ప్రోత్సాహకాలు!

- మూడేళ్లుగా విడుదలవ్వని ఆయిల్‌పామ్ రాయితీ
- స్టేట్ ప్లానింగ్, ఎపిఐఐఎటిపి నిధులు విడుదలలో జాప్యం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మనదేశంలోనూ వంట నూనెల ధరలు పెరిగాయి. ఆ తర్వాత కూడా వీటి ధరలు పెరుగుతూ వచ్చాయి. వీటి ధరలు తగ్గించడానికి కేంద్రం చర్యలు తీసుకోకపోగా ఆయిల్‌పామ్ రైతుకు ఇస్తున్న సబ్సిడీని మూడేళ్ల నుంచి పెండింగ్‌లో పెట్టింది. సబ్సిడీలను సకాలంలో ఇవ్వడానికి, మరిన్ని రాయితీలు ఇచ్చి సాగును ప్రోత్సహించడానికి బదులు నిరుత్సాహపరుస్తోంది. పైగా ముడి పామోలిన్, సోయా, పొద్దుతిరుగుడు వంట నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని తాజాగా 20 శాతం పెంచింది. దీంతో, వంట నూనెల ధరలు లీటర్‌పై రూ.15 నుంచి రూ.20 వరకూ పెరిగాయి.

ప్రత్యామ్నాయ ఉద్యాన పంటల సాగు, పంటల ఉత్పత్తుల పెంపు ప్రోత్సాహక రాయితీల విడుదలలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పామాయిల్, రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కెవివై) నిధుల విడుదలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతోంది. మూడేళ్లుగా పామాయిల్ సాగు రాయితీలను, రెండేళ్లుగా ఆర్‌కెవివై రాయితీలను కేంద్రం విడుదల చేయలేదు. దీనికితోడు స్టేట్ ప్లానింగ్, ఇరిగేషన్ ఇంటెన్సిఫికేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎపిఐఐఎటిపి) నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం ఇదే తీరుగా వ్యవహరిస్తోంది. కృష్ణా జిల్లాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 5,726 మంది రైతులకు రూ. 5,64,20,023 రాయితీలు పెంగింగ్‌లో ఉన్నాయి. ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెంచడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పామాయిల్ తోటల సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించింది. ఈ పంట సాగుకు అసక్తి చూపుతున్న రైతులకు ఆయిల్‌పామ్ కంపెనీలు పామాయిల్ మొక్కలను ఉచితంగా ఇచ్చాయి. దీంతో, కృష్ణా జిల్లాలో బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని మెట్ట ప్రాంతాలకు పరిమితమైన ఈ పంట నల్లరేగడి భూములకూ విస్తరించింది. మూడేళ్లలో కృష్ణా జిల్లాలో 7,019 ఎకరాల అదనపు విస్తీర్ణంలో పామాయిల్ తోటలు సాగయ్యాయి. సాగుదార్లకు ఏటా రూ.2,100 చొప్పున మూడేళ్లపాటు సేద్యం ఖర్చులను కేంద్రం అందించాలి. మూడేళ్లల్లో ఒక్కసారి కూడా రాయితీని కేంద్రం విడుదల చేయలేదు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో 5,568 మంది రైతులకు రూ.4,96,21,753 రాయితీ బకాయిలు పెండింగ్ ఉన్నాయి. ఆర్‌కెవివైలో పండ్ల తోటలు, కూరగాయలు ఉత్పత్తుల పెంపునకు మౌలిక వసతులు ఏర్పాటు చేసుకున్న రైతులకు రాయితీలు అందించాలి. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో 125 మంది రైతులకు రూ.29,62,870 రాయితీ పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్టేట్ ప్లాన్‌లో (టార్పాలిన్లు, స్ప్రేయర్లు తదితరాలకు) 2019-20, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో 33 మందికి రూ.38,35,400 విడుదలవ్వాల్సి ఉంది.

ఆందోళనలో రైతులు

కృష్ణా జిల్లాలో వరి, చెరకు ప్రధాన పంటలుగా ఉండేవి. గిట్టుబాటవ్వక క్రమంగా చెరకు పంట సాగును రైతులు మానుకుంటున్నారు. ఈ పంట సాగు చేసే నీరు నిల్వ ఉండని మెరక భూముల్లో ప్రత్యామ్నాయంగా పామాయిల్ తోటలు వేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.



పోలీసు కస్టడీకి నందిగం సురేష్

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్ (గుంటూరు)

టిడిపి కార్యాల యంపై దాడి కేసులో మాజీ ఎంపి నందిగం సురేష్‌ను మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం కస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 15 నుంచి 17 వరకు ఆయనను విచారించేందుకు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మంగళగరి రూరల్ స్టేషన్‌కు సురేష్‌ను పోలీసులు తీసుకొచ్చి రాత్రి ఎనిమిది గంటల వరకు విచారించారు. ఈ కేసులో ఈ నెల 5న పోలీసులు ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించింది. అప్పటి నుంచి గుంటూరు జిల్లా జైలులోనే ఉన్నారు. డిఎస్‌పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. పోలీసు స్టేషన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తనకు ఏమీ తెలియదని, గుర్తు లేదని, దాడి జరిగిన రోజు తాను మంగళగిరిలో లేనని విచారణ సందర్భంగా సురేష్ సమాధానాలు చెప్పినట్టు తెలిసింది.

అసమానతలు తొలగితేనే సమగ్రాభివృద్ధి

- జెవివి వార్షిక మహాసభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ప్రాంతీయ అసమానతలు తొలగితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. అనంతపురంలోని జిఆర్ ఫంక్షన్ హాలులో రెండు రోజులపాటు జరిగిన జెవివి వార్షిక రాష్ట్ర మహాసభ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి-కొన్ని పరిశీలనలు' అనే అంశంపై సదస్సు జరిగింది. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరై ప్రసంగించారు. ప్రభుత్వాల లెక్కల ప్రకారం అభివృద్ధి అంటే జిడిపి, తలసరి ఆదాయం వంటి ఆర్థికపరమైన అంశాలేనని తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి. సుస్థిర అభివృద్ధి, సమ్మిళిత అభివృద్ధి, అందరికీ విద్య, వైద్యం, ఉపాధి లభించినప్పుడే నిజమైన అభివృద్ధి అవుతుందని వివరించారు. రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్నది అసమగ్ర అభివృద్ధి అని పేర్కొన్నారు. ఎపి అంటే అమరావతి, పోలవరం అని మాత్రమే మిగతా 2లో



జెవివి మహాసభ సందర్భంగా ప్రజలను చైతన్యం చేస్తూ గాజు పెంకులపై నడుస్తున్న దృశ్యం

ఉచిత పంటల బీమా అమలు

- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతుల పంటకు సమగ్ర ఉచిత పంటల బీమా విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి క్రిష్ణయ్య, కె ప్రభాకర రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రప్రభుత్వం 2024 రబీ, 2025 ఖరీఫ్, రబీ సీజన్‌లకు కొత్త పంటలబీమా విధానం ప్రకటించిందని తెలిపారు. రైతులకు ఇన్సూరెన్స్ ప్రీమియం మినహాయించి గతంలో రుణాలు బ్యాంకులు ఇచ్చాయని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రతిపాదించిన విధానంలో రైతులే ప్రీమియం చెల్లించాలని, ఇది సరైంది కాదని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమాలో భాగంగా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలకు లాభదాయకంగా, రైతులకు నష్టదాయకంగా ఈ విధానం ఉందని వివరించారు. ఈ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల భాగస్వామ్యం పేరుతో రైతులపై భారం వేసే విధానాన్ని మానుకోవాలని సూచించారు. సమగ్ర ఉచిత పంటల బీమా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డిఫాల్ట్ సర్వీస్ ప్రొవైడర్లకు షోకాజ్ నోటీసులు

- గ్రామ, వార్డు సచివాలయాల శాఖ

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకుల ఫోటోలు, లోగోలున్న స్టేషనరీని సర్వీస్ సర్టిఫికెట్లకు ఉపయోగించకూడదని గ్రామ వార్డు సచివాలయాల శాఖ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఒకటికి రెండు సార్లు గ్రామ వార్డు సచివాలయాలు, మీ సేవ కేంద్రాల నిర్వాహకు లకు ఉత్తర్వులిచ్చినప్పటికీ అందుకు విరుద్ధంగా వ్యవహరించిన మీ సేవ నిర్వాహకులకు, డిఫాల్ట్ సర్వీస్ ప్రొవైడర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు గ్రామవార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. తాజాగా వత్సవాయి మండలం దుబ్బాకపల్లిగ్రామ మీసేవ కేంద్రంలో ఓ రైతు అడంగల్ కాపీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మాజీ సిఎం జగన్ ఫొటోతో ఉన్న అడంగల్ కాపీ ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మీ సేవ కేంద్రాల్లో ఉన్న పాత స్టేషనరీని వెంటనే స్వాధీనం చేసుకోవాలని సంబంధిత అధికారులకు డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

'ఉక్కు' రక్షణకు మోడీ ప్రభుత్వాన్ని నిలదీయండి

(మొదటి పేజీ తరువాయి)

ఇంకెప్పుడు స్పందిస్తారని అన్నారు. టిడిపి కూటమి తక్షణమే రంగంలోకి దిగి ప్లాంట్ అమ్మకం ఆపించి, సెయిల్‌లో విలీనం చేయించాలని, సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ సాధించాలని, ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఆఫీసర్లు, పర్మినెంట్, కాంటాక్ట్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, బి.ఈశ్వరమ్మ, బి.జగన్, జిల్లా నాయకులు పి.మణి, వై.సత్యవతి, ఎం.రాంబాబు, వి.నరేంద్ర కుమార్, వి.కృష్ణారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వైటి.దాస్, నమ్మి రమణ, ఎస్.రామారావు, జి.శ్రీనివాసరావు, పి.వెంకట రెడ్డి, స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెవిడి.ప్రసాద్ పాల్గొన్నారు. తొలుత ఇటీవల కన్నుమూసిన పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఇఇఎస్ఎల్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్ అవార్డు

- సిఐఐ రజతోత్సవంలో అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర విద్యుత్‌శాఖకు చెందిన ప్రభుత్వరంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఇఇఎస్ఎల్)కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు దక్కింది. 2023-24 సంవత్సరానికిగాను భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) 25వ వార్షికోత్సవం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బిఇఇ) మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉజాలా పథకంతోపాటు దేశవ్యాప్తంగా విభిన్న పరిశ్రమల్లో విజయవంతంగా ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేసినందుకుగాను ఇఇఎస్ఎల్‌కు ఈ అవార్డు దక్కిందని వెల్లడించారు. ఎల్ఇడి దీపాల ఏర్పాటుతో భారతదేశ లైటింగ్ పరిశ్రమ గతిని మార్చడంలో ఇఇఎస్ఎల్ కీలకపాత్ర పోషించిందని తెలిపారు. 36 కోట్ల ఎల్ఇడి బల్బుల పంపిణీతోపాటు 3.5 లక్షల కిలోమీటర్ల రహదారుల్లో 1.3 కోట్ల వీధి దీపాలను అమర్చారని వివరించారు. తద్వారా ఇంధన పొదుపుతోపాటు పర్యావరణానికి భారీగా లబ్ధి చేకూరిందని తెలిపారు. ఈ సందర్భంగా బిఇఇ సెక్రటరీ మిలింద్ దేవరా మాట్లాడుతూ స్వచ్ఛ ఇంధనం దిశగా భారత్ దూసుకెళ్తోందని వెల్లడించారు. ఉజాలా, పెర్ఫామ్-అచీవ్-ట్రేడ్ (పిఎటి) వంటి కీలకమైన ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలుతో వివిధ రంగాల్లో ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఇందన సామర్థ్య కార్యక్రమాల అమలుపై మరింత దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలను స్థిరంగా అమలు చేయడం ద్వారా హైదరాబాద్, అమరావతి ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలులో కృషిచేసిన ఇఇఎస్ఎల్ బృందానికి ఆ కంపెనీ సిఇఒ విశాల్ కపూల్ అభినందనలు తెలిపారు. ఉజాలా పథకం వల్ల దేశం 9,586 మెగావాట్ల పీక్ డిమాండ్‌ను తప్పించుకోవడమే గాక ఏటా రూ.19,152 కోట్లు ఆదా చేసుకోగలుగుతుందని వెల్లడించారు. ఇఇఎస్ఎల్‌మార్ట్.ఇన్ ద్వారా ఇంధన సామర్థ్య ఉపకరణాలను అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నట్లు సేల్స్, కమ్యూనికేషన్స్ అధిపతి అనిమేష్ మిశ్రా తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం ఇంధన సామర్థ్య రంగంలో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు.



ఇంపాక్ట్ అవార్డు అందుకుంటున్న ఇఇఎస్ఎల్ సేల్స్, కమ్యూనికేషన్స్ అధిపతి అనిమేష్ మిశ్రా

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

- 'విశాఖ ఉక్కు'పై ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపేందుకు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్రప్రభుత్వాన్ని సిపిఐ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ ఆదివారం లేఖ రాశారు. ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోందని తెలిపారు. ఇప్పటికే రెండు ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేసి మూసివేశారని, ఇప్పుడు మరో ప్లాంట్ ఉత్పత్తి ఆపేసేందుకు చూస్తున్నారని వివరించారు.

గతంలో లాభాల్లో ఉన్న ఫ్యాక్టరీని తెగనమ్మేందుకు కేంద్రప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. లక్షల కోట్ల రూపాయల విలువ కలిగిన భూములు, ప్లాంట్ ఆస్తులు కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిందని తెలిపారు. అందులో భాగంగానే ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి ఆ సాకుతో అమ్మకానికి సిద్ధపడుతోందని పేర్కొన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఉద్యోగులు నిరంతర పోరాటాలు చేస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారని, ప్రైవేటీకరణ ఆపేందుకు ఒత్తిడి పెంచాలని చంద్రబాబును కోరారు. ప్లాంట్ అభివృద్ధికి అవసరమైన ఐరన్ ఓర్ గనుల కేటాయింపు జరిగేలా తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

ప్రతి బాధితుడినీ ఆదుకుంటాం

- పారదర్శకంగా నష్టం వివరాల నమోదు
- మంత్రి పి నారాయణ


ప్రజాశక్తి-విజయవాడ

వరద ముంపు ప్రభావం పడిన ప్రాంతాల్లో చివరి మైలు వరకు న్యాయం చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి బాధితునికీ అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి నారాయణ అన్నారు. పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా నష్టం వివరాల నమోదుతో నివేదికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో నష్ట వివరాలతో నివేదికల రూపకల్పనపై చర్చించారు. రీవెరిఫికేషన్, సూపర్‌చెక్‌కు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముంపు ప్రభావం పడిన ప్రతి ఇంటినీ సందర్శించి, నష్టం నమోదు చేసినట్లు తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలో 4,036 మంది ఎన్యూమరేటర్లతో దాదాపు 1,75,000 గృహాలకు ఎన్యూమరేషన్ చేశారని వివరించారు. ఎలాంటి పొరపాట్లకూ తావులేకుండా నివేదికలు రూపొందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో రీవెరిఫికేషన్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. నష్టపోయిన ప్రతిఒక్కరినీ ఆదుకుంటామని తెలిపారు. సమావేశంలో పురపాలక శాఖ డైరెక్టర్ ఎం.హరినారాయణన్, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెసి డాక్టర్ నిధి మీనా, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దాతల విరాళాలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో పలువురు ఆదివారం కలిసి చెక్కులు అందించారు. జివికె ఫౌండేషన్ చైర్మన్ జివికె రెడ్డి, జివి సంజయ్‌రెడ్డి రూ.5 కోట్లు అందించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్మన్ అరుణ్ అలగప్ప ఎండి శంకర్ సుబ్రహ్మణ్యం రూ.1.50 కోట్లు, కాంటినెంటర్ కాఫీ తరపున చల్లా శ్రీశాంత్ రూ.1.11 కోట్లు ఇచ్చారు. చల్లా రాజేంద్రప్రసాద్ ఫ్యామిలీ ఫౌండేషన్ తరపున చల్లా అజిత, ట్రైజియా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి వేములపల్లి అశోక్, రోహిత్, లారస్ ల్యాబ్స్ ఫౌండర్, సిఇవో సత్యనారాయణ చావా, నాగరాణి చావా, నెల్లూరుకు చెందిన గంటా రమేష్, రమణయ్యనాయుడు, రూ.1కోటి చొప్పున అందించారు. చలసాని చాముండేశ్వరి, శ్రీమాన్ రూ.25 లక్షలు అందించారు. అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, నరసింహారావు రూ.2 లక్షలు చొప్పున అందజేశారు.





చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న జివికె ఫౌండేషన్ చైర్మన్ జివికె రెడ్డి, జివి సంజయ్‌రెడ్డి, లోకేశ్‌కు విరాళం అందజేస్తున్న దివిస్ ఎమ్‌డి మురళి

లోకేష్‌కు రూ.5 కోట్లు విరాళమిచ్చిన దివిస్ ఎమ్‌డి

వరద బాధితుల కోసం దివిస్ ఎమ్‌డి మురళి దివి మంత్రి నారా లోకేష్‌కు రూ.5 కోట్లు అందించారు. మరో రూ.5 కోట్లు అక్షయపాత్ర పాత్ర కోసం అందించారు. తెలంగాణలో వరద బాధితుల కోసం మరో రూ.5 కోట్లు దివిస్ సిఇవో అందజేశారు.

47 మంది డిఎస్‌పిల బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 47మంది డిఎస్‌పిలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటిదాకా వెయిటింగ్‌లో వున్న 18 మంది డిఎస్‌పిలకు ఈ ఉత్తర్వుల్లో పోస్టింగ్‌లను ఇచ్చారు. ముగ్గురు డిఎస్‌పిలను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో తెలిపారు. పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి, సత్తెనపల్లె డిఎస్‌పి జి గుమాద బాబు, కావలి డిఎస్‌పి ఎం వెంకటరమణను రాష్ట్ర డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను తక్షణం అమలులోకి తీసుకురావాలని పోలీస్‌శాఖలోని అన్ని విభాగాలకు రాష్ట్ర డిజిపి ఆదేశాలను జారీ చేశారు.

ఎంబిబిఎస్ సీట్లు వద్దని చంద్రబాబు లేఖ రాయడం దుర్మార్గం

- మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన దిశగా పాలన చేస్తోందని, రాష్ట్రానికి కేటాయించిన ఎంబిబిఎస్ సీట్లను వద్దని లేఖ రాయడం తగదని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పక్క రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబిబిఎస్ సీట్ల కోసం ప్రదక్షిణలు చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం మంజూరైన సీట్లను వద్దని లేఖలు రాయడం తగదని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వస్తే మెడికల్ సీట్లన్ని ఫ్రీ అని, ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలనే ప్రైవేట్‌కు అమ్మేస్తున్నారని ఆరోపించారు. గత వైసిపి ప్రభుత్వం రికార్డుస్థాయిలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో రూ.8,480 కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రారంభించామన్నారు. గత ఏడాది ఐదు కాలేజీల్లో 750 సీట్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ఏడాదిలోనే మరో ఐదు కాలేజీలు మదనపల్లె, పులివెందుల, ఆదోని, మార్కాపురం, పాడేరుల్లో మరో 750 సీట్లు అందుబాటులోకి రావాల్సి వుందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆ సీట్లు రాలేదన్నారు. పాడేరు మెడికల్ కాలేజీకి, పులివెందుల కాలేజీకి 50 సీట్లు చొప్పున మంజూరు చేస్తే, వద్దంటూ లేఖ రాయడం ఏంటని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేసే స్కామ్‌లకు ఆలోచన చేయడం తగదని పేర్కొన్నారు. మెడికల్ సీట్లను రద్దు చేయాలంటూ రాసిన లేఖను చంద్రబాబు తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బోధనేతర పనుల విముక్తి ఉంటుందా?

- టీచర్లకు తప్పని యాప్‌ల గోల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఇప్పటి వరకు బోధనేతర పనులతో సతమతమయ్యాం. ఈ పనుల నుంచి తమకు విముక్తి కలిగిస్తామని కొత్తగా వచ్చిన రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు తమకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగిస్తుందా? లేదా?' అని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. మరుగుదొడ్ల ఫొటోలు తీసే పని నుంచి విముక్తి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, పర్యవేక్షించే బాధ్యత మాత్రం కొనసాగుతోంది. దీంతోపాటు ఇతర యాప్‌ల భారం ఇంకా కొనసాగుతుండటంతో ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలకు దూరంగా ఉండాలి. రాష్ట్రంలో ఇది అమలు కావడం లేదు. పాఠశాల ప్రారంభమైన నుంచి ముగిసే వరకు యాప్‌లతో కుస్తీపడుతున్నారు. విద్యార్థుల హాజరుతోపాటు ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టం ఫర్ మిడ్ డే మీల్స్ అండ్ శానిటేషన్ (ఐఎంఎంఎస్), మధ్యాహ్న భోజనం పథకం, విద్యార్థుల కిట్లు, తదితర యాప్‌లను విద్యాశాఖ రూపొందించింది. వీటిలో నమోదు బాధ్యత అంతా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే చూసుకోవాలి. ఈ యాప్‌లకు సంబంధించిన సర్వర్లు నెమ్మదిగా ఉండటం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల మొదలైన నుంచి యాప్‌ల నిర్వహణకే సరిపోవడం తప్ప బోధనకు సమయం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌ల గోల తగ్గించాలని ఎనిమిదేళ్ల నుంచి ప్రభుత్వం దృష్టికి పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలు తీసుకొచ్చాయి. ఉన్నవాటిని తొలగించకపోగా ప్రతి ఏటా కొత్త యాప్‌లను విద్యాశాఖ సృష్టిస్తూ ఉపాధ్యాయులను బోధనకు మరింత దూరం చేస్తోంది. బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఒక్క మరుగుదొడ్ల ఫోటోలు తీసే పని నుంచి మాత్రమే విముక్తి కలిగించారు. వారంలో కొన్ని రోజులు తల్లిదండ్రుల కమిటీలు, మరికొన్ని రోజులు సచివాలయ సిబ్బంది ఫొటోలు తీయాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే ఈ ఫొటోలు తీశారా? లేదో పర్యవేక్షించి యాప్‌లో నమోదు చేయాల్సిన బాధ్యతను ప్రధానోపాధ్యాయులకే అప్పగించారు. ప్రతి పాఠశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించి యాప్‌ల బాధ్యతలు అప్పగించాలని, తమకు విముక్తి కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

'బుడమేరు' బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

- ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విజయవాడ బుడమేరు వరదలతో నష్టపోయిన సుందరయ్యనగర్, రాజీవ్ నగర్, పాయకాపురంలోని రజక వృత్తిదారులకు ఎపి రజక వృత్తిదారుల సంఘం తరపున నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మనూరు భాస్కరయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రజక వృత్తిదారుల సంఘం నాయకులు లింగాల నిర్మలమ్మ అధ్యక్షతన పంపిణీ చేశామన్నారు. వీరతెలంగాణ పోరాటంలో పాల్గొని పీడిత ప్రజల కోసం పోరాడిన చిట్యాల ఐలమ్మ, విద్యుత్ అమరవీరుడు రామకృష్ణ పోరాట త్యాగాలు తమకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు లింగాల నిర్మలమ్మ, కోరట్ల శ్రీనివాస్, శివ దుర్గ భవాని, శ్రీకాకుళం పార్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

అసమానతలు తొలగితేనే సమగ్రాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెబుతున్నారని, ఇవి కాదని... రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం వెనుకబడి ఉన్నాయని గుర్తు చేశారు. అభివృద్ధి చెందాయని చెప్పుకునే గుంటూరు, కృష్ణా జిల్లాల్లోనూ కొన్ని ప్రాంతాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని తెలిపారు. ప్రాంతీయ అసమానతలను తొలగించి సమగ్రాభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అశాస్త్రీయ భావాలను తొలగించేందుకు సైన్స్ ప్రచారాన్ని విస్తృతం ప్రచారం చేయాల్సి ఉంటుందని తెలిపారు. అశాస్త్రీయ భావాల ప్రభావం యువతపై ఇప్పుడు ఎక్కువగా ఉంటోందన్నారు. దీనిని అధిగమించేందుకు జెవివి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు అవడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్; ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ప్రముఖ కార్డియాలజిస్టు వంశీకృష్ణ, జెవివి జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

మాయలు మంత్రాలు కాదు... బాబాలు, ఇతరుల పేర్లతో చేసేవన్నీ ట్రిక్స్ మాత్రమేనని చాటిచెప్పే విధంగా జన విజ్ఞాన వేదిక సభ్యులు ఆరవేటి ప్రసాద్ కొన్ని ప్రదర్శనలు చేసి చూపించారు. నోటిలో మంటలు వెలిగించుకోవడం, కడుపులో కత్తులు పెట్టుకోవడం, గాజు పెంకులపై నడవడం వంటివి చేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన కూడా గాజు పెంకులపై నడిచి చూపించారు.

రెండు రోజులపాటు సుదీర్ఘ చర్చలు

జన విజ్ఞాన వేదిక మహాసభ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన జెవివి నాయకులు, కార్యకర్తలు రెండు రోజుల పాటు సుదీర్ఘ చర్చలు జరిపారు. గత రెండేళ్ల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను ఆయా ప్రాంతాల వారీగా వివరించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడానికి చేయాల్సిన పనులపై చర్చించారు. ప్రధానంగా యువతలో శాస్త్రీయ భావాల పెంపుదలకు కృషి చేయడంపై దృష్టి సారించాలని తీర్మానించారు. ఇందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించారు.

ఇండియా - 'ఎ' జయభేరి

• 186 పరుగుల తేడాతో ఇండియా-డిపై విజయం • సెంచరీతో తెలుగుతేజం రిక్కీ భుయ్ సూపర్ ఇన్నింగ్స్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



దులీప్ ట్రోఫీలో ఇండియా-'ఎ' జట్టు విజయభేరి మోగించింది. ఆదివారం ఆర్‌డిటి స్పోర్ట్స్ సెంటర్‌లో ఇండియా- 'డి' తో జరిగిన మ్యాచ్‌లో 186 పరుగుల భారీ తేడాతో 'ఎ' జట్టు గెలుపొందింది. తెలుగు తేజం రిక్కీ భుయ్ విరోచిత ఇన్నింగ్స్‌తో సెంచరీ సాధించినా అతనికి తోడు ఎవరూ క్రీజ్‌లో నిలబడకపోవడంతో 'డి' జట్టు 301 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 'ఎ' జట్టులో ఆల్ రౌండర్ సామ్స్ ములానీ 89 పరుగులతో పాటు తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్, రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీయడంతో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎన్నికయ్యాడు. ఇండియా-'సి', 'బి' జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎనిమిది వికెట్లతో పాటు 38 పరుగులు సాధించిన అన్షుల్ కాంబోజ్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎన్నికయ్యాడు.

రిక్కీ భుయ్ సూపర్ ఇన్నింగ్స్

488 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన ఇండియా - 'డి' జట్టు ఆదివారం నాడు ఓవర్‌నైట్ స్కోర్ 62/1తో ప్రారంభించింది. యష్‌దుబే, రిక్కీ భుయ్‌లు నెమ్మదిగా పరుగులు రాబట్టే ప్రయత్నం చేశారు. యష్ దుబే 94 బంతుల్లో ఐదు బౌండరీల సహాయంతో 37 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. రెండో డౌన్‌లో వచ్చిన దేవదత్ పడిక్కల్ కేవలం ఒక పరుగు చేసి సామ్స్ ములానీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, రిక్కీ భుయ్‌లు జతకలిశారు. వీరిద్దరూ అవకాశం దొరికినప్పుడల్లా బంతిని బౌండరీకి పంపారు. రిక్కీ భుయ్ 195 బంతులు ఎదుర్కొని 14 బౌండరీలు, మూడు భారీ సిక్సర్ల సాయంతో 113 పరుగులు చేశాడు. 41 పరుగులు చేసి శ్రేయస్ అయ్యర్ 41 (8 ఫోర్లు) చేశాడు. శ్రేయస్ అవుటయ్యాక వికెట్ కీపర్ సంజు సామ్సన్, రిక్కీ భుయ్‌లు కాసేపు నిలకడగా ఆడారు. తర్వాత సామ్సన్ అవుట్ అయ్యాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. రిక్కీ భుయ్ దూకుడు తగ్గలేదు. చూడచక్కని షాట్లతో అందరినీ అలరించాడు. దూకుడుగా ఆడుతున్న రిక్కీ భుయ్‌ను తనుష్ కొటియన్ అవుట్ చేశాడు. సౌరభ్‌కుమార్ 22, హర్షిత్ రాణా 24 పరుగులు చేశారు. ఇండియా 'ఎ' బౌలర్లలో సామ్స్ ములానీ 3, తనుష్ కొటియన్ 4, రియన్ పరాగ్, ఖలీల్ అహ్మద్ చెరో వికెట్ తీసుకున్నారు.

ఇండియా సి, బి మ్యాచ్ డ్రా

ఓవర్‌నైట్ స్కోర్ 309/7తో ప్రారంభించిన ఇండియా 'బి' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 108 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో ఇండియా 'సి' జట్టుకు 193 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇండియా 'బి' జట్టు కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 286 బంతుల్లో 157 (14 ఫోర్లు, సిక్సర్) పరుగులు చేశాడు. ఇండియా 'సి' బౌలర్ అన్షుల్ కాంబోజ్ 27.5 ఓవర్లలో 69 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. విజయకుమార్, వైశాక్, మయాంక్ మార్కండే చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం ఇండియా 'సి' జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 128/4 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. జట్టులో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 93 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సర్ సహాయంతో 62 పరుగులు (అర్ధసెంచరీ) సాధించాడు. రజత్ పటీదార్ 84 బంతుల్లో 5 ఫోర్ల సహాయంతో 42 పరుగులు చేశాడు. ఇండియా 'బి' బౌలర్లలో రాహుల్ చాహర్ 2, ముకేష్‌కుమార్, ముషీర్ ఖాన్ చెరో వికెట్ తీసుకున్నారు.

మరోసారి గ్రౌండ్‌లోకి యువకుడు

ఆదివారం నాడు మ్యాచ్ జరుగుతుండగా ఓ యువకుడు స్టేడియంలోకి వెళ్లాడు. తన అభిమాన క్రికెటర్ కోసం బ్లాక్ 'సి','డి' మీద గ్రౌండ్లోకి ఒకసారిగా దూకేశాడు. ఆ యువకుడు గ్రౌండ్లో పరిగెత్తడంతో భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకున్నారు. కాగా ఆ యువకుడికి మాటలు రాకపోవడంతో భద్రతా సిబ్బంది పోలీసులకు అప్పగించారు. మొదటి మ్యాచ్‌లో సైతం ఓ అభిమాని మైదానంలోకి దూకి రుతురాజ్ గైక్వాడ్ కాళ్లు మొక్కిన విషయం తెలిసిందే. అభిమానులు పదేపదే మైదానంలోకి వెళ్తున్నా వారిని నిలువరించడంలో భద్రతా వైఫల్యం కన్పిస్తుండడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మెరిసిన బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖిల్

- మహ్మద్ రియాన్‌కు ఐఆర్ఎల్ టైటిల్

చెన్నై : ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్)లో చెన్నై టర్బో రైడర్స్ డ్రైవర్ మహ్మద్ రియాన్ తొలి విజయం సాధించాడు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్)లో భాగంగా చెన్నైలోని రేసింగ్ ట్రాక్‌లో జరుగుతున్న పోటీల్లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అఖిల్ అలీభాయ్ మెప్పించాడు. నాల్గో రేసులో అగ్రస్థానంలో నిలిచిన అఖిల్ 24.37.329 సెకండ్లలో రేసును ముగించాడు. ఫార్ములా 4 రేసుల్లో భాగంగా జరిగిన మూడు రౌండ్ల రేసుల్లో ముగ్గురు విజేతలుగా నిలిచారు. తొలి రేసులో మహ్మద్ రియాన్, రెండో రేసులో రుహన్ అల్వా, మూడో రేసులో వీర్ సేత్, నాల్గో రేసులో అఖిల్ అగ్రస్థానం సాధించారు. రెండో రేసులో సైతం మెప్పించి రెండో స్థానంలో నిలిచిన అఖిల్ భాయ్..ఓవరాల్‌గా మెడల్ పోడియంపై రన్నరప్‌గా నిలిచాడు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ నాల్గో రౌండ్ పోటీలు అక్టోబర్ 19-20న కోయంబత్తూర్‌లో జరుగునున్నాయి.

ప్రజా పోరాటాల ఛాంపియన్

(మొదటి పేజీ తరువాయి)

క్యూబా రాయబార కార్యాలయ ఇన్‌ఛార్జ్ సిపిఎం కేంద్ర కార్యాలయానికి వచ్చి నివాళులర్పించారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి అందించిన సేవలను గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) శ్లాఘించింది. కమ్యూనిస్టు - వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశాలలో (ఐఎంసిడబ్ల్యుపి) ఆయన భాగస్వామి అయ్యే వారని తెలిపింది. గ్రీస్‌లో ఏచూరి పర్యటనను, రెండు పార్టీల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ఆయన పోషించిన పాత్రను ప్రస్తావించింది. పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ (పిసిపి) పంపిన సంతాప సందేశంలో ప్రపంచంలోని కమ్యూనిస్టు పార్టీలు పలు సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఏచూరి కన్నుమూయడం విచారకరమని పేర్కొంది. సైప్రస్‌కు చెందిన ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ ది వర్కింగ్ పీపుల్ (ఎకెఇఎల్) ఏచూరి రాజకీయ చిత్తశుద్ధి, సమగ్రత, ముందుచూపు ఎల్లప్పుడూ గుర్తుంటాయని పేర్కొంది. పలు అంతర్జాతీయ సదస్సులు, సెమినార్లు, సమావేశాల సందర్భంగా తమ పార్టీ శ్రేణులకు ఏచూరిని కలిసే అవకాశం లభించిందని బెల్జియం వర్కర్స్ పార్టీ (పిటిబి) తెలిపింది. తుది శ్వాస విడిచే వరకూ విలువలకు కట్టుబడిన సైనికుడని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ టర్కీ (టికెపి) కొనియాడింది.

మా దేశ ప్రజలకు స్నేహితుడు: నేపాల్ కమ్యూనిస్టు పార్టీ

ఏచూరి తమ పార్టీకి, దేశ ప్రజలకు మంచి స్నేహితుడని నేపాల్ మాజీ ప్రధాని, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యుఎంఎల్) అధ్యక్షులు కెపి ఒలి పేర్కొన్నారు. రాచరికానికి వ్యతిరేకంగా నేపాల్‌లో జరిగిన పోరాటానికి ఆయన మద్దతు ఇచ్చారని తెలిపారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) కూడా ఏచూరి మృతికి సంతాపం తెలిపింది. ప్రజలకు ఏచూరి అందించిన సేవలను శ్రీలంకకు చెందిన జనతా విముక్తి పెరుమన (జెవిపి) గుర్తు చేసింది. అంతర్జాతీయ ఉద్యమాలలో ఏచూరి గుర్తించదగిన నాయకుడని శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ (సిపిఎస్ఎల్) తెలిపింది. పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీ (సిపిపి), ఆవామీ వర్కర్స్ పార్టీ ఆఫ్ పాకిస్తాన్ కూడా ఏచూరి మృతికి సంతాపం తెలిపాయి. భారత్‌లో కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య ఉద్యమానికి ఏచూరి మృతి తీరని లోటని బంగ్లాదేశ్ కమ్యూనిస్ట్ పార్టీ (డబ్ల్యుబిపి) చెప్పింది. వెనెజులా, మెక్సికో, బ్రెజిల్, స్పెయిన్, వర్కర్స్ స్పెయిన్, ఐర్లాండ్, జర్మనీ దేశాల కమ్యూనిస్టు పార్టీలతో పాటు బ్రెజిలియన్ కమ్యూనిస్టు పార్టీ, ఇటలీ కమ్యూనిస్టు రీఫౌండేషన్ పార్టీ, గలిజాన్ పీపుల్స్ ఫోరం, ఇరాన్ టుడేహ్ పార్టీ, రివల్యూషనరీ కమ్యూనిస్ట్ లీగ్ ఆఫ్ బంగ్లాదేశ్, సిపిఎన్, యూనిటీ, నేషనల్ కాంపెయిన్ తదితర పార్టీలు, సంస్థలు ఏచూరి మృతికి సంతాపం తెలిపాయి.

మెడికల్ సీట్లపై దుష్ప్రచారం

- మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మెడికల్ సీట్లపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి హయాంలో మెడికల్ కళాశాల నిర్మాణాలు ప్రారంభించారే తప్ప ఒక్కటైనా పూర్తిచేశారా అని ప్రశ్నించారు. సగానికిపైగా కళాశాలల నిర్మాణం పునాదిదశలో ఉందని వివరించారు. పూర్తికాకుండానే గతేడాది రాజమండ్రి కళాశాల ప్రారంభించారని, అక్కడ కనీసం విద్యార్థులకు తరగతి గదులు కూడా లేవని తెలిపారు. తాత్కాలిక భవనాల్లో తరగతులు నడపాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పులివెందుల వైద్య కళాశాలలో 48శాతం బోధనా సిబ్బంది లేరని వెల్లడించారు. జగన్‌కు ప్రచార ఆర్భాటం తప్ప ఐదేళ్లల్లో ప్రజలకు చేసింది ఏమిలేదని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కీలకమార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు సబ్ రిజిస్ట్రార్ కూర్చొనేందుకు న్యాయమూర్తుల తరహాలో ప్రత్యేకంగా ఉండే ఎత్తైన పోడియం, ప్రత్యేక కుర్చీ , అడ్డుగా ఉండే ఎర్రని వస్త్రం వంటి వాటికి చెల్లుచీటి పలుకుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

వరుసగా మూడు రోజులు సెలవుదినాలు కావడంతో మంగళవారం నాటికి పూర్తిగా రూపు రేఖలు మారే విధంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనరు శేషగిరిరావు చర్యలు చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగడంతో పాటు కార్యాలయానికి వచ్చే వారు కూర్చునేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్లకు ముందు మూడు కుర్చీలు వేయాలని కూడా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏటా వెంటాడుతున్న ముంపు

- డెల్టా రైతులను వెంటాడుతున్న కష్టాలు
- కాల్వలు, డ్రెయిన్ల నిర్వహణలో తొలగని నిర్లక్ష్యం
- భారీ వర్షాలతో 4 జిల్లాల్లో 4 లక్షల ఎకరాల్లో ముంపు



గుంటూరు జిల్లా కొల్లిపర మండలం హనుమాన్ పాలెం గ్రామం వద్ద వరద నీటిలో మునిగిన నిమ్మ తోట

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

భారీ వర్షాలు, వరదలకు కృష్ణా డెల్టాకు ఏటా ముంపు సమస్య వెంటాడుతోంది. తాజాగా సంభవించిన వాయుగుండం ప్రభావంతో కురిసిన అతిభారీ వర్షాల వల్ల గుంటూరు జిల్లాలో 86 వేల ఎకరాలు, కృష్ణా జిల్లాలో 1.12 లక్షల ఎకరాలు, ఎన్‌టిఆర్ జిల్లాలో 1.06 లక్షల ఎకరాలు, బాపట్ల జిల్లాలోని డెల్టా మండలాల్లో 98 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఈ మేరకు కేంద్ర బృందానికి నాలుగు జిల్లాల అధికారులు నివేదికలు సమర్పించారు. కృష్ణా డెల్టా పరిధిలో దాదాపు 13.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలతోపాటు ఏలూరు కాలువ పరిధిలో మరో 65 వేల ఎకరాల ఆయకట్టు దీనికింద సాగులో ఉంది. 2006లో వచ్చిన తుపాను, భారీగా వరదలతో డెల్టా మొత్తం అతాలకుతలమైంది. ఈ ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు 2006లో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా ప్రపంచ బ్యాంకు నిధులతో డెల్టా ఆధునీకరణ పనులను మంజూరు చేశారు. నీటిపారుదల కాలువలను, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు మురుగునీటిపారుదల పనులు కూడా చేపట్టాలని నిర్ణయించారు. 2008-09లో ఈ పనులు ప్రారంభమయ్యాయి. 2014-15 వరకు పనులు కొనసాగాయి. ఈ పనులను చేపట్టిన ప్రముఖ కాంట్రాక్టు ఏజెన్సీలు నేరుగా చేయకుండా సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల నాణ్యత కొరవడిందన్న విమర్శలు వచ్చాయి. నాలుగు జిల్లాల పరిధిలో దాదాపు రూ.4 వేల కోట్లతో డెల్టా ఆధునీకరణ పనులు చేపట్టినా ముంపు సమస్య మాత్రం ఏటా వెంటాడుతూనే ఉంది. నాలుగేళ్లలో పూర్తి చేయాల్సిన పనులను దాదాపు తొమ్మిదేళ్ల పాటు కొనసాగించారు. కాల్వలు, డ్రెయిన్లు ఏటా కొట్టుకుపోకుండా, గండ్లు పడకుండా అప్పట్లో సిమెంట్ లైనింగ్‌తో కూడిన నిర్మాణాలు చేపట్టారు. అయినా, ఇప్పటికీ ముంపు తప్పడం లేదు. చిన్నపాటి వాగులు, వంకలు పొంగి ప్రవహించి పొలాలను ముంచెత్తి పంటలను ముంచెత్తుతున్నాయి.

పొలాల్లో నీరు బయటకుపోవడానికి ఈసారి 14 రోజులు పట్టింది. దీంతో, పంట మొత్తం నాశనమైంది. కొన్నిచోట్ల డ్రెయిన్లు, కాల్వలు కలిసి ప్రవహిస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని కృష్ణా డెల్టా పరిధిలో కొల్లిమెర్ల వాగు, మేకల వాగు, చేబ్రోలు సైడ్ డ్రెయిన్, జల్లవాగు డ్రెయిన్, కొండవాగు అప్పర్ స్ట్రీమ్, గుంటూరు నల్లయ్య మేజర్ డ్రెయిన్, రేపల్లే మెయిన్ డ్రెయిన్, తుంగభద్ర డ్రెయిన్‌లకు రూపొందించిన డిజైన్లకు మించి వరద రావడంతో ముంపు వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అన్ని కాల్వలు, డ్రెయిన్లకు కలిపి 11,701 క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా రూపొందించారని, 15,643 క్యూసెక్కుల వరద గత నెల 31న ఒకేసారి రావడంతో ముంపు సమస్య ఏర్పడిందని జలవనరుల శాఖ ప్రభుత్వానికి నివేదించింది. కాల్వలు, డ్రెయిన్ల ఆధునీకరణ పనులు చేపట్టి దాదాపు పదేళ్లు దాటిందని, వీటిని నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నీరు ముందుకు కదలే పరిస్థితిలేక మొత్తం నీరంతా పొలాలపై పడిందన్న విమర్శలు వచ్చాయి. కాల్వలకు గండ్లు పడడం, భారీ వరద నీరు రావడం వల్ల నీటిపారుదల శాఖకు రూ.54.89 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. బాపట్ల, కృష్ణా జిల్లాల పరిధిలో కూడా పొలాల ముంపు సమస్య పరిష్కారానికి రూ.150 కోట్లు అవసరమనని ప్రతిపాదించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

- వినాయకుడి లడ్డు దక్కించుకున్న ముస్లిం యువకుడు

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం బొద్దికూరపాడు గ్రామానికి చెందిన షేక్ కమల్‌వలీ అనే ముస్లిం యువకుడు వినాయకుడి లడ్డును దక్కించుకున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. బొద్దికూరపాడు గ్రామంలోని బిసి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద 50 కిలోల లడ్డుకు ఆదివారం వేలంపాట నిర్వహించారు. ముస్లిం యువకుడు షేక్ కమల్ వలి వేలంపాటలో పాల్గొని రూ.26 వేలకు



వినాయకుడి లడ్డును సొంతం చేసుకున్న షేక్ కమల్

లడ్డును దక్కించుకున్నారు. ఈ సంఘటన, మత సామరస్యతకు ప్రతీకగా నిలవడంతో పలువురి ప్రశంసలు అందుకున్నారు.

కెసి కెనాల్‌లో జవాన్ గల్లంతు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కెసి కెనాల్‌లో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి నీటి ప్రవాహంలో ఓ ఆర్మీ జవాన్ కొట్టుకుపోయారు. ఈ సంఘటన కర్నూలులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు నగరం బి క్యాంపునకు చెందిన లక్ష్మీపవన్ కల్యాణ్ (24) జమ్మూలో జవాన్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 3న సెలవులపై కర్నూలుకు వచ్చారు. వినాయక చవితి నిమజ్జనం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తన మిత్రులు అఖిల్ సుధాకర్‌తో కలిసి ఈ నెల 14న వినాయక ఘాటు వద్ద జరుగుతున్న నిమజ్జనం ఏర్పాట్లను తిలకించారు. అక్కడి నుండి తన మిత్రులతో కలిసి కొత్త బస్టాండుకు వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో తిరిగి వస్తూ కెసి కెనాల్‌లో ఈత కొట్టేందుకు దిగారు. ఈత కొడుతూ ఆవలిగట్టుకు చేరుకొని తిరిగి ఈవలిగట్టుకు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. దీంతో ఈ విషయాన్ని స్నేహితులు పోలీసులకు, స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జవాన్ కోసం తీవ్రంగా గాలించినా ఎలాంటి ఫలితమూ దక్కలేదు. జవాన్ తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెచ్చిపోయిన కామాంధులు

- మంగళగిరిలో ఇద్దరు బాలికలపై అత్యాచార యత్నం
- నిందితులపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో కామాంధులు రెచ్చిపోయారు. 24 గంటల వ్యవధిలో రత్నాలచెరువు, బాలాజీనగర్‌లో ఇద్దరు బాలికలపై అత్యాచారయత్నాలు జరిగాయి. శుక్రవారం జరిగిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. శనివారం రాత్రి నిందితులను పోలీసులు అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు వివరాలను పోలీసులు మీడియాకు ఆదివారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని రత్నాలచెరువుకు చెందిన 7వ తరగతి చదువుతున్న మైనర్‌పై అదే ప్రాంతానికి చెందిన 50 ఏళ్ల గుంటూరు వెంకటేశ్వరరావు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం బాలిక తల్లిదండ్రులు పనికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా నిద్రపోతున్న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇంతలో నిద్రలేచిన బాలిక బిగ్గరగా అరుస్తూ బయటకు పరిగెత్తి పక్కింటి వారికి విషయం చెప్పింది. సమాచారం అందుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వరరావుపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా మంగళగిరి నగర పరిధిలోని బాలాజీనగర్‌లో ఏడేళ్ళ బాలికపై అదే ప్రాంతానికి చెందిన వడ్రంగి పని చేసుకునే 60 ఏళ్ల చింతక్రింది వెంకటేశ్వరరావు అత్యాచారానికి యత్నించాడు. ఈలోపు బాలిక తల్లిదండ్రులు రావడంతో అక్కడ నుంచి పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.



ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలోని రైస్‌మిల్లులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-యంత్రాంగం

వేర్వేరు జిల్లాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో ఇర్ఫాన్ కోళ్లఫారంలో అక్రమంగా నిల్వ ఉంచిన 6,500 కిలోల పిడిఎస్ బియ్యాన్ని రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కోళ్లఫారాన్ని సీజ్ చేసి, కోళ్లఫారం యజమాని ఇర్ఫాన్, బిడ్డిక సూరన్నలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు, డిప్యూటీ తహశీల్దార్ రామారావు తెలిపారు.

ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామ సమీపంలోని శ్రీ లక్ష్మీ గణపతి రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉన్న 600 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కార్డుదారుల నుండి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి భారీ నిల్వలు ఉంచారు. వీటితోపాటు, వరద బాధితులకు ఇచ్చిన రేషన్ బియ్యం కూడా సేకరించి మొత్తం 600 బస్తాలతో లారీలో రైస్‌మిల్లుకు తరలించారు. కంచికచర్ల ఎస్ఐ బోనగిరి రాజు రేషన్ నిల్వలపై దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని నిర్వాహ కులు రీసైక్లింగ్ చేసి సాంబమసూరు బియ్యంలో కలిపి భారీ అమ్మకాలు జరుపుతున్నట్లుగా పోలీసుల విచారణలో బయటపడింది. లారీతోపాటు రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం జడ్.రాగంపేటలో అక్రమంగా తరలిస్తున్న 38.84 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామం నుంచి పిడిఎస్ బియ్యాన్ని రాజానగరం వైపునకు వాహనంలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విజిలెన్స్ సిఐ టి.వెంకటనాగరాజు గండేపల్లి మండలం జడ్.రాగంపేట గ్రామ శివారులో తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని జగ్గంపేటలోని ఎంఎస్ఒ పాయింట్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణంపై నీలినీడలు!

- ఒక్క అడుగూ ముందుకు పడని పనులు
- బుడమేరు వరదతో సమస్య మళ్లీ తెరపైకి



ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం జరిగేనా? అనే అనుమానాలు నెలకొన్నాయి. రెగ్యులేటర్ల నిర్మాణంపై అదిగో.. ఇదిగో అంటూ వైసిపి ప్రభుత్వం కాలక్షేపం చేసింది. టిడిపి కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుండా పరిశీలిస్తామంటూ చేస్తున్న వ్యాఖ్యలతో కొల్లేరు, ఏలూరు జిల్లావాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బుడమేరు వరదల నేపథ్యంలో కొల్లేరు కకావికలంగా మారడంతో కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం మరోసారి తెరపైకి వచ్చింది. ఉప్పుటేరులో పూడికతీత పనులు చేపట్టడంతోపాటు రెగ్యులేటర్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని జిల్లా ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. సముద్రం నుంచి ఉప్పు నీరు ఎగదన్ని కొల్లేరులోకి ప్రవేశించడంతో అభయారణ్యం కలుషితమవుతోందని, దీన్ని అరికట్టడానికి ఉప్పుటేరుపై ఆకివీడు మండలం దుంపగడప, కృష్ణా జిల్లా పడితడక, మొల్లపర్రు వద్ద మొత్తం మూడు రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టనున్నామని గత వైసిపి ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు రూ.470 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పింది. 2022 మే 16న గణపవరం మండలంలో జరిగిన బహిరంగ సభలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ రెగ్యులేటర్ల నిర్మాణానికి వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి 2023 జూన్‌లో శంకుస్థాపన చేస్తానని ప్రకటించారు. ఆ తర్వాత రెగ్యులేటర్ల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. కనీసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. దాదాపు 77 వేల ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. బెడ్, బెల్టు గ్రామాలు 120 వరకూ కొల్లేరును ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ దాదాపు ఐదు లక్షల మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. కొల్లేరు ప్రాంతంలో వడ్డెరలు, దళితులు ఎక్కువగా ఉన్నారు. కొల్లేరులో ఎన్నో రకాల మత్స్యసంపద ఉంది. ఏటా వందల రకాల పక్షులు వివిధ దేశాల నుంచి ఇక్కడికి వలస వస్తుంటాయి. చేపల వేటతో ఇక్కడి ప్రజలు జీవనం సాగించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొల్లేరులోకి బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు వంటి ఏరులతోపాటు 67 కాలువల నుంచి నీరు వచ్చి చేరుతోంది. కొల్లేరు ఆక్రమణలకు గురికావడంతోపాటు చుట్టుపక్కల పరిశ్రమల నుంచి వ్యర్థాలన్నీ వచ్చి కలుస్తున్నాయి. దీంతో, అభయారణ్యం కలుషితంగా మారి మత్స్య సంపద హరించుకుపోతోంది. గతంలో కొల్లేరులో ఏడాదికి పది నెలలపాటు నీరు నిల్వ ఉండేదని, ఆక్రమణల వల్ల రెండు నెలలు కూడా నీరు ఉండడం లేదని కొల్లేరువాసులు ఇటీవల సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. రెగ్యులేటర్ల నిర్మాణం జరిగితే కొల్లేరులో నీరు నిల్వ ఉండడంతోపాటు మత్స్య సంపద మరింత పెరిగి అక్కడి ప్రజలకు ఉపాధి దొరుకుతుంది. పర్యాటకంగా కొల్లేరును మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.

సిఎం చంద్రబాబు వ్యాఖ్యలతో అయోమయం

ఇటీవల బుడమేరు ఉగ్రరూపం దాల్చడంతో కొల్లేరుకు వరద పోటెత్తింది. దీంతో, కొల్లేరు గ్రామాలను వరద చుట్టుముట్టడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన, గ్రామాల్లోని రహదారులు సైతం ముంపు బారిన పడ్డాయి. ఉప్పుటేరు పూడుకుపోవడంతో వరద నీరు వేగంగా సముద్రంలోకి వెళ్లడం లేదు. ఉప్పుటేరులోకి 12,500 క్యూసెక్కుల నీరు వెళ్లాల్సి ఉండగా, ఆరు వేల క్యూసెక్కుల నీరు కూడా వెళ్లడం లేదని ఇటీవల వరదల్లో తేటతెల్లమైంది. వరద బాధితులను పరామర్శించేందుకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఏలూరు వచ్చారు. సిఆర్‌ఆర్ కాలేజీ ఆడిటోరియంలో కొల్లేరువాసులతో ఆయన ముఖాముఖీ మాట్లాడారు. ఉప్పుటేరు పూడికతీత, రెగ్యులేటర్ల నిర్మాణంపై కొల్లేరువాసులు ప్రస్తావించారు. రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేస్తామని సిఎం ఎటువంటి హామీ ఇవ్వలేదు. పరిశీలిస్తామంటూ దాటవేశారు.

స్టీల్‌ప్లాంట్‌పై కూటమి కుట్రలు

- ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



మాట్లాడుతున్న బొత్స

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కుట్రలు చేస్తున్నారంటూ టిడిపి కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖ లాసన్స్ బే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఆంధ్రుల సెంటిమెంట్ అని తెలిపారు. దీని ఏర్పాటు కోసం వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేశారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయివేటీకరణకు కుట్రలు పన్నుతోందని ధ్వజమెత్తారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వైసిపి వ్యతిరేకమని ప్రధాని మోడీకి వైఎస్.జగన్ చెప్పారన్నారు. ఉక్కు కార్మికులకు వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. 15 రోజులుగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు తమ నిరసనను మరింత పెంచారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్లాంట్‌పై తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుతో పదోన్నతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ ద్వారా పదోన్నతులు కల్పించాలని, అందుకు ప్రభుత్వం కృషి చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి సర్వీస్ నిబంధనలు అమలు సాధ్యం కాని పక్షంలో మేనేజ్‌మెంట్ వారి పదోన్నతులు కల్పించాలని కోరారు.

నడి సంద్రంలో ఫిషింగ్ బోటు దగ్ధం

- ఐదుగురు మత్స్యకారులు సురక్షితం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం),అమరావతి బ్యూరో

విశాఖ తీరం నడి సంద్రంలో ఫిషింగ్ బోటు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదం నుంచి ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున ఐదుగురు మత్స్యకారులు వాసుపల్లి అప్పయ్యమ్మకు చెందిన మెకనైజ్డ్ బోటులో చేపల వేటకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బోటు ఇంజన్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తిగా బోటు దగ్ధమైంది. ప్రాణభయంతో మత్స్యకారులు బోటు నుంచి సముద్రంలోకి దూకేశారు. తమకు సమీపంలో ఉన్న ఏరుపల్లి ధనరాజుకు చెందిన బోటులో ఆదివారం సాయంత్రం సురక్షితంగా హార్బర్‌కు చేరుకున్నారు. ఒడ్డుకు చేరుకొన్న మత్స్యకారుల్లో వి.గురుమూర్తి, ఆర్.నర్సింహులు, గణగళ్ల రాము, ఉమ్మడి సత్తయ్య, సురపతి అప్పన్న ఉన్నారు. మత్స్య శాఖ ఇన్‌ఛార్జి జాయింట్ డైరెక్టర్ జి.విజయ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొని మత్స్యకారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జరిగిన ప్రమాదంపై నివేదికను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ ఏడాది జూన్ 15న వేట ప్రారంభమయ్యాక ఇప్పటి వరకు ఆరు బోట్లు ప్రమాదాలకు గురయ్యాయని, వాటిలో రెండు అగ్నికి ఆహుతయ్యాయని తెలిపారు. రైతుల మాదిరిగానే మత్స్యకారులకు ఎప్పటికప్పుడు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులను రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు



సముద్రంలో దగ్ధమవుతున్న బోటు

పరామర్శించారు.

అచ్చెన్నాయుడు ఆరా

విశాఖపట్నంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన బోటు ప్రమాదంపై వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. మత్స్యకారుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వేటకు వెళ్లిన ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని, రూ.35 లక్షల మేర ఆస్తి నష్టం ఉంటుందని మత్స్యశాఖ అధికారులు మంత్రికి వివరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహన పెంచాలని మంత్రి అధికారులకు సూచించారు.



శోక్ శ్రీనివాస్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న వైఎస్ విజయమ్మ

నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయాం : వైఎస్ విజయమ్మ

ప్రజాశక్తి - కామవరపుకోట (ఏలూరు జిల్లా)

నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడిని చింతలపూడి నియోజకవర్గం కోల్పోవడం బాధాకరమని మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ అన్నారు. ఏలూరు జిల్లా కెఎస్ రామవరం గ్రామంలోని ఇటీవల అనారోగ్యంతో మరణించిన చింతలపూడి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్ ఇంటికి ఆదివారం ఆమె వెళ్లారు. ఆయన చిత్రపటం వద్ద విజయమ్మ నివాళులర్పించారు. ఆనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అశోక్ శ్రీనివాస్ సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులు, కార్యకర్తలు ఈ దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే కె రఘురామకృష్ణంరాజు అశోక్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 16 సెప్టెంబర్ 2024



"నాది ప్రజల ఉద్యమం. దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను"

– గురజాడ అప్పారావు



వాన రాదారుల్లో ...

చూరునుంచి కారుతున్న వాన నీళ్లు
సరాసరి అన్నం కంచంలోనే పడుతున్నాయి
తడిసిన పుల్లలు
పొయ్యిలో రేపుతున్న పొగ
ఇంటిని కంటిని చుట్టుముట్టి
కన్నీటి తుపాన్లు రేపుతోంది

వానంటే గ్రీష్మానికి ఎండిన
మట్టి గర్భాన్ని తడిపే చినుకు మాత్రమే కాదు;
సుడులు తిప్పే నీళ్ళల్లో
బతుకుల్ని తిప్పేసే
చినుకుల సమూహం కూడా!

వానంటే మొలలోతు నీళ్లల్లో మునిగిన
ఆరుగాలపు కష్టం కూడా
రేకుల్లోంచో మైనపు కాగితాల మధ్య నుంచో
కారుతున్న దుఃఖపు పోట్లు కూడా
కట్టుకున్న బట్టలు మాత్రమే మిగిలి ఉన్న వేళ
గుప్పెడు మెతుకుల కోసం
ఆహార పొట్లమై
వర్షం కళ్ళతో దిక్కులు చూడటం కూడా!

టీవీల ముందు పోసిన
వేడి వేడి పకోడీలు నంజుకొంటూ
పొంగిపొర్లుతున్న కాలువల
దృశ్యాల ముక్కలు తింటున్న ఎవరికైనా
అది ఒకానొక దృశ్యం మాత్రమే!

కొండలే ప్రవహించాయో
అడవులే కొట్టుకొచ్చాయో
ఆక్రమణలై మూసుకుపోయిన
దారుల్ని ఒరుసుకుంటూ
నిన్ను నిండా ముంచేసిన నీటినే అడగాలి!
చెరువు కాళ్లల్లో ఆకాశహర్మ్యాలై దిగబడ్డ
ముళ్లకంపల్ని తొలగించేదెవరు?

కాగితప్పడవల పిల్ల కాలువలు
మహోధతాలై
నగరాల నడిరోడ్లపై పారుతున్నప్పుడు
నదిని తినేసిన చెద పురుగుల్నే
ప్రశ్నించాలిప్పుడు
నీరింకి పోవాల్సిన చోట
మనిషింకి పోవడమే విషాదం!

– బండ్ల మాధవరావు
88976 23332

సంతాప తీర్మానం

నిన్నటిదాకా నీళ్ళ చిరునామా
నదులూ సముద్రాలే అనుకొన్నా
చంచల మనస్కుల్లా
సహజగతిని మార్చుకొంటాయనుకోలేదు
కళ్ళు తెరిచినా కళ్ళు మూసినా
కలలోనూ మెలకువలోనూ
నీళ్ళు నీళ్ళు నీళ్ళు నీళ్ళు
జేగురురంగు చిక్కని వరద నీరు
వీధులు నదులైన వింత దృశ్యం
పిలవకుండా వచ్చిన అతిథిలా చాపకింద నీరులా
నిశ్శబ్దంగా ఇంట్లోకి అడుగు పెట్టినప్పుడు
ఆ నీళ్ళే కళ్ళల్లోకి
పెట్టుబడిదారుల పెరిగిపోయే ఆస్తుల్లా
చూస్తుండగానే ఇళ్ళను
నిలువెత్తునా ముంచెత్తిన నీళ్ళు
ఒకొక్క అడుగు నీటిమట్టం పెరుగుతున్నపుడు
భయం సర్పం గుండెల్లో మెదులుతున్న చప్పుడు
తడిసిన ఒకొక్క పుస్తకాన్ని
చేతుల్లో పొదివి పట్టుకొన్నపుడల్లా
పురిట్లోనే కన్ను మూసిన బిడ్డల్ని
చూస్తున్న కన్నతల్లి వేదన!
వేయి వెలుతురు పూల పగటికీ
దిగులు చీకటి రాత్రికి
తేడా తెలీని స్థితి!
బిగిసిన జల సమాధిలో
ఉక్కిరిబిక్కిరైన ఊపిరి పిట్టలు
'పుట్టుట గిట్టుట కొరకే'
గుర్తుకొచ్చే వేళలు
బతుకు యుద్ధంలోనైనా
ఏ యుద్ధంలోనైనా
పోరాడే యోధులం మేమే!
మీ అధికార సింహాసనాలకు మూలాధారాలం
ఓటర్లం వినియోగదార్లం
ఆధార్ నెంబర్లు తప్ప పేర్లు లేని అనామకులం
ఇవాళ కన్ను మూస్తే రేపటికి రెండు
మా శవాలంటే ఎవరికీ లెక్క లేదు
బహుశా మర్నాడు అసెంబ్లీలో
సంతాప తీర్మానం ప్రవేశ పెడ్తారేమో!

– మందరపు హైమవతి
94410 62732

యోధుడా .. జోహార్!

నేలకొరిగిన మార్క్సిస్టు అగ్రశిఖరమా
కనుమరుగైన కాంతి పుంజమా
మార్క్సిస్టు సైద్ధాంతిక దిగ్గజమా..
మా అందరి సీతారామ్ ఏచూరీ..
విద్యార్థి దశనుంచే మొలకెత్తిన చైతన్య ప్రజాస్వరమా!
పాలక దుశ్చర్యలను ఎండగట్టే వీరోచిత ప్రజాగళమా!
సుదీర్ఘ రైతాంగ చారిత్రక ఆందోళనకు
తోడుగ నిలిచిన కార్మిక జన శ్రేణులు
కార్మిక కర్షకమైత్రి వికసించిన వేళ
నీవు నేర్పిన పోరు బాట ఫలితమే!

కార్పొరేటు, మతోన్మాద కలయికతో
మంటగలుస్తున్న మన ఘన వైవిధ్యం
ముందే గుర్తించిన దార్శనికుడా!
పార్లమెంటులోనూ, బయటా పోరుబాట తప్ప
వేరే మార్గం లేదని అదే శ్రామికజన ఆయుధమని
తేల్చి చెప్పి
ఎర్రజెండా చేతికిచ్చి ముందుకు నడిపించిన
శ్రామికజన యోధుడా!
'ఇండియా' వేదికను ప్రజల దరి చేర్చిన
ప్రజల ఎజెండాకు రూపకర్త నీవే!
ఎన్నటికీ కనుమరుగు కావు నీ జ్ఞాపకాలు
బాధ్యతగా కృషి చేస్తాం నీ ఆశయసాధనకు
నీ ఆచరణ నీడలో సైద్ధాంతిక వెలుగులో!

– ప్రభాకర్


ఉత్తరాంధ్ర నుంచి విమర్శక గళం

కళింగాంధ్ర సాహిత్యం విమర్శకు గురైంది తక్కువ. పొగడ్తో తెగడ్తో ఏదీ సరిగ్గా జరిగింది లేదు. మరీ ముఖ్యంగా 1975 తర్వాత కళింగ నేల మీద ఉద్భవించిన కవిత గానీ, కథ గానీ, నవల గానీ చెప్పుకోదగిన విమర్శకు గురికాలేదు. గురజాడ, చాసో, రావిశాస్త్రి, కారా సాహిత్యంపై విలువైన విమర్శే వచ్చింది. అయితే అదంతా 1975కి పూర్వం వెలువడిన సాహిత్యం మీద. ఒకరకంగా కళింగాంధ్ర సాహిత్యం మీద విమర్శ కారా మాస్టారి 'యజ్ఞం' కథ దగ్గర ఆగిందేమో అని కూడా అనిపిస్తుంటుంది.

రాచపాళెం వంటి విమర్శకులు 'గురజాడ' మీద ఇప్పటికీ నాణ్యవంతమైన విమర్శని రాస్తున్నారు. అది ముందు చెప్పుకున్నట్టు 1975 ముందర వెలువడిన సాహిత్యానికి సంబంధించినది. 'సందిగ్ధ సందర్భం' వెలువరించిన సి.వి.సుబ్బారావు గారు కళింగాంధ్ర సాహిత్యం మీద మంచి విమర్శే రాశారు. గురజాడ 'కన్యాశుల్కం' మీదా, చాసో సంపాదకత్వంలో వెలువడిన 'కళింగ కథానికలు' కథాసంకలనం మీదా ఆయన విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. కాత్యాయని విద్మహే గారూ తిమోతి జ్ఞానానంద కవి వంటి వారి మీద విలువైన విమర్శనా వ్యాసాలే రాశారు. 'సుంకిరెడ్డి' కళింగాంధ్ర సాహిత్యం మీద చెప్పుకోదగిన విమర్శనాత్మక వ్యాసాలే రాశారు – ఇటీవల 'గురజాడ.. మరికొన్ని వ్యాసాలు' పేరుతో పుస్తకమూ తెచ్చారు.

కళింగ ప్రాంతానికే చెందిన 'చిత్ర' కథ మీద మంచి విమర్శ రాశారు. కె.ఎన్. మల్లీశ్వరి 'కథా స్థానికత' పేరుతో వర్తమాన కళింగాంధ్ర కథకుల మీద రాసిన వ్యాసాలతో 2013లో ఒక పుస్తకమూ తెచ్చారు. భూషణం, పతంజలి, అట్టాడ, గంటేడ కథా/ నవలా సాహిత్యం మీద కొంత మేలిమి విమర్శే వచ్చింది. కానీ రావాల్సినంత రాలేదు. సువర్ణముఖి, బజరా, జగదీశ్ మీదా రావాల్సినంత విమర్శ రాలేదు. వర్తమాన విమర్శకుల్లోకిన్నెర శ్రీదేవి గారు, ఇద్దరో ముగ్గురో పరిశోధక విద్యార్థులు తప్పితే పెద్దగా ఇటుకాసి తలతిప్పి విమర్శ రాసినవారు లేరు. గంటేడ 'మాయ' కథ మీద చర్చలో భాగంగా దుప్పల రవికుమార్ నుంచి మంచి విమర్శ వ్యాసం వొకటి వచ్చింది. ప్రముఖ విమర్శకులు ఏకే ప్రభాకర్ గారు– సహృదయంతో కళింగాంధ్ర కథని దగ్గరకు తీసుకుని– విలువైన విషయాలను లోకం దృష్టికి తీసుకొచ్చారు.

కళింగ నేల మీద 1970, 80 తర్వాత వచ్చిన సాహిత్యం మంచి చెడులను విప్పిచెప్పే సరైన విమర్శకులే కరువైన స్థితి. కరువు నేల కళింగాంధ్ర సాహిత్యంలోని మంచిచెడులనూ విమర్శించటానికి విమర్శకుల కరువే కారణమా– ఔను– అచ్చంగా అదే కారణం. ఈ నేల మీదా పెద్దగా విమర్శకులు మొలకెత్తలేదు. మీరు గమనిస్తే– పైన నేను పేర్కొన్న కళింగాంధ్ర సాహిత్య విమర్శ గురించి తెలియజేసింది ఎంతోకొంత కథ/ నవల మీద మాత్రమే! మరి కవిత్వం సంగతో?



• • •

కళింగాంధ్ర కవిత్వం చాలా విస్తతమైనది. ఆధునిక కళింగ నేల కవిత్వాన్ని గురించి మాట్లాడాలంటే మళ్లీ గురజాడ నుంచే మొదలు పెట్టుకోవాలి. గురజాడ గేయఖండికల మీద చాలా విస్తతమైన విమర్శ వెలువడిందనేది తెలిసిన విషయమే! ఆ తదుపరి శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, ఆరుద్ర వంటి వారి మీదా హెచ్చుతగ్గులుగా మంచి విమర్శే వచ్చింది. మళ్లీ చెబుతున్నాను– 1975 తర్వాత వచ్చిన కథ మీద లాగే కళింగాంధ్ర కవిత్వం మీదా సరైన విమర్శ లేదు. ఆ మాటకొస్తే కథ కన్నా కవిత ఇంకా వెనుకబడిందనే చెప్పాలి. పాణిగ్రాహి, వంగపండు మీద గొప్ప విమర్శ బాకీ పడే వుంది తెలుగు సాహిత్య సమాజం. 'శ్రీకాకుళం' ఛాయరాజ్ కవిత్వం మీద గర్వపడే విమర్శ ఏది? కథా, కవిత్వ విమర్శ విషయంలో కళింగాంధ్ర ఇప్పటికీ బోలుగానే వుంది.

• • •

ఇలాంటి ఒక కొత్త సందర్భంలో– ఈ నేల నిక్కచ్చిమైన విమర్శను కోరుకుంటున్న సన్నివేశంలో– మా రాజాం తిరుపతిరావు గారు విమర్శలోకి దిగారు. ఇతని విమర్శలో ఎక్కువగా పాజిటివ్ పాలే వుండొచ్చు– రేపొద్దుటికి అతను బాగా సివక ముగ్గి పండి పక్వమౌతారు. రెండేళ్ల కిందట 'ఆజిరి' పేరుతో ఒక విమర్శ పుస్తకం తీసుకొచ్చారు. సాహిత్యలోకంలోకి బాగానే వెళ్లిందది. అయితే అది ప్రత్యేకంగా కళింగాంధ్ర విమర్శ మాత్రమే కాదు. ఇతర ప్రాంత కవుల మీద, కథకుల మీద సాహిత్యవ్యాసాలున్న సంకలనం. ఇప్పుడు ఆయన తీసుకొస్తున్న ఈ పుస్తకం ప్రత్యేకమైనది. 1970 నాటి అభ్యుదయ కవి 'సీరపాణి' ప్రసిద్ధ కవిత్వ సంపుటి 'ఢమరుధ్వని' కవిత్వం మీద విపులంగా రాసిన సాహిత్య వ్యాసాల సంపుటిది. 'ఢమరుధ్వని'లో వున్న 27 కవితల మీద 27 విశ్లేషణ వ్యాసాల సమాహారం. 'ఢమరుధ్వని' 1979లో వచ్చింది. ఇందులోని ప్రతి కవితను తిరుపతిరావు గారు అతని చేవ కొద్దీ– విశ్లేషించారు. ఇంచుమించుగా కవితల ఆత్మని తనలోకి ఇంకించుకుని– విశ్లేషణా వ్యాసాలుగా అనువదించబడ్డారు. ఇతని ప్రయత్నాన్ని, పట్టుదలని మనం మెచ్చుకోకుండా వుండలేం. విమర్శక సాధనాపరుడు ఈయన. ఒకటో కవిత 'ఢమరుధ్వని' నుంచి 27వ కవిత 'బ్రెన్ గన్' వరకు కవితను విశ్లేషణ చేసినప్పుడు ఎక్కడా తననుకున్న పద్ధతి నుంచి తొణకలేదు. తను నిర్మించుకున్న వాక్యం నుంచి పక్కకు జరగలేదు. నిర్మాణాత్మక విమర్శ చేశారు.

పుస్తకం

విమర్శకుని రాతలో కూడా ఒక లయ వుండాలి. ఆ లయ తెలీకుండానే విమర్శకుని సృజనలోకి వొలుకుతుంది. ఇక్కడ పిల్లా తిరుపతిరావు గారి ఈ విశ్లేషణాత్మక వ్యాసాల్లో ఆ లయాత్మకత పొదగబడివుంది. 1979లో వచ్చిన 'సీరపాణి' కవిత్వ లోతు తెలుసుకోవడానికి– ఉపయోగపడే రాతలివి. ఎప్పుడో ఏడాది, ఏడాదిన్నర కిందట మొదలుపెట్టిన పనిని నిమగ్నంగా చేయడం ద్వారా విమర్శకుడిగా ఆయన ఈ పనిని సుసాధ్యం చేశారు. ఒక పక్క సీరపాణిని తన లోపలికి ఉన్మీలనం చేసుకుంటూనే వర్తమాన సాహిత్యాన్ని అధ్యయనం చేయటం బహుశా అతనికి లాభించిందనే అనుకుంటాను. ఈ అధ్యయన ప్రభావం ఈ సాహిత్య విశ్లేషణ వ్యాసాలను మరింత వెలిగించింది. కవి గానీ, కథకుడు గానీ, విమర్శకుడు గానీ ఎప్పటికప్పుడు తనని తాను రీవిజిట్ చేసుకోవాలి. నిరంతరం సానబెట్టుకోవాలి. ఈ విషయంలో విమర్శకుడికి– కవి కన్నా, కథకుడు కన్నా మరీ ఎక్కువ బాధ్యత వుంది.

• • •

పిల్లా తిరుపతి రావు గారి విమర్శనా పటిమను తేటపరిచే కొన్ని ముఖ్యమైన అంశాలూ ఈ విశ్లేషణాత్మక వ్యాసాల్లో మనకు కనిపిస్తాయి.

'సాంప్రదాయ శిల్పంలో అభ్యుదయ వస్తువు'– ఆనాడు సహజంగా వుండిన రూపం– ఈ రకమైన వస్తుశిల్పాలను గురించి చెప్పేటప్పుడు విమర్శకుడు చాలా నిలకడగా నిర్వహించారనొచ్చు. కవి కవిత్వంలోని సాంప్రదాయ భావనల తీరుతెన్నులను స్ప ృశించినప్పుడు– విమర్శకుడిగా మరింత చేతనను వ్యక్తం చేయాల్సింది అని కూడా అనిపించింది. ఈ విమర్శకుడు హేతువాదే– కానీ కవి రాసిన కవిత్వంతో నడవగలిగే సంయమనం ఇతనికి వుంది అనేదానికి ఉదాహరణగా కొన్ని కవితలు తప్పక నిరూపిస్తాయి.

'కన్నీటి లేఖ' వంటి కవితను విశ్లేషణ చేసినప్పుడు కవిత్వ ధారలో సంపూర్ణంగా నిమగ్నం కావడం మనం గమనిస్తాం. కవి యొక్క కవిత్వధారలో కలిసి నడవడమనే పనిని సునాయాసంగా చేయటం వలన విమర్శకుడు కవిని గౌరవించినట్లే ఐంది. విమర్శకుడికి వివేచన అవసరం. ఆ గుణమూ ఈ విమర్శనా పుస్తకంలో మనకు కనిపిస్తుంది.

'సీరపాణి' అనబడు ఒక 1970ల నాటి కవిని అంచనా కట్టిన విమర్శకుడిగా పిల్లా తిరుపతిరావు గుర్తుండిపోతారు. ఈ వ్యాసాల్లో వివరణ బాగుంటుంది. ఈ విమర్శనాత్మక వ్యాసాల వెల్లువలో– సీరపాణి గారి గురించి బయటకు అంతగా తెలియని విషయాలను తిరుపతి రావు గారు ప్రేమగా పంచుకున్నారు. అందుకే ఈ మొత్తం రచనను నేను 'సహృదయ సద్విమర్శ రచన'గా అని అనదలిచాను.

ఈ విమర్శకునికి– 'ఆకలి' వంటి కవితల్లోని కవిత్వ స్వభావాన్ని చాలా తేటగా గ్రహించి విశ్లేషణ రూపంలో అందించగల చేవ వుంది. ఆధునిక కవితా రీతులు పట్ల అవగాహన వున్న విమర్శకుడు కాబట్టి– నలభైఏళ్ల కిందటి వ్యక్తీకరణ రీతినీ– పట్టుకోగలిగాడు. 'సీరపాణి' గారి కవిత్వంలోని ప్రగతిశీల అంశని సరిగ్గానే అంచనా కట్టారు. 'హెచ్చరిక' కవిత అందుకు వొక ఉదాహరణ. 'సీరపాణి' కవిత్వంలో కళింగనేల స్వరం వినిపించే కవితల్లో వొకటి– 'ఏరువాక'. వ్యవసాయ నేపథ్య కవిత. జానపద సవ్వడులు ప్రతిధ్వనించిన కవిత. ఈ కవిత విశ్లేషణలో– వస్తువుతో పాటు సమానంగా ప్రయాణించిన విమర్శకుని చూపు కనిపిస్తుంది. కవిత్వంతోపాటు ప్రయాణించగల సద్విమర్శకుడీయన. కవితో పాటూ విమర్శకుడూ భావుకుడైనప్పుడే ఇలా ప్రయాణించటం సాధ్యం. దానిని నిరూపించారు తిరుపతిరావు గారు.

• • •

సమాజం మీద కవిత్వం, కథ నిర్వహించాల్సిన పాత్ర ఎంత వుందో, విమర్శ నిర్వహించాల్సిన పాత్రా అంతే వుంది. ఇంకా చెప్పాలంటే విమర్శకుడిది మరి కాస్తా ఎక్కువ బాధ్యతాయుతమైన పాత్రే. విమర్శకుడిది– సాహిత్య ఉత్పత్తి మంచీచెడుల లోతులను చెప్పాల్సిన వ్యవహారం. విమర్శకుడు రాతలో నిక్కచ్చిగా– నిర్మోహమాటంగా వుండాలి– అప్పుడే విలువైన విమర్శ బయటకు వస్తుంది. పిల్లా తిరుపతిరావు కళింగాంధ్ర నుంచి ఎదిగివస్తున్న విమర్శకుడు, సద్విమర్శకుడు.

కళింగాంధ్ర అభ్యుదయ కవిత్వపు పాయలో 'డమరుధ్వని' ముఖ్యమైనది. 1970 – 80 ప్రాంతంలో నిర్వహించాల్సిన పాత్రని 'డమరు ధ్వని' నిర్వహించింది. అప్పటి వ్యక్తీకరణ తీరుని అది పొదిగివుంది. వస్తువు బలమైనది. సీరపాణి గారి సాధన లోతు 'డమరుధ్వని'లో మనకి కనిపిస్తుంది.

– బాల సుధాకర్

('డమరుధ్వని–ప్రతిధ్వని' పుస్తకావిష్కరణ 22-09-2024న రాజాంలో జరుగుతుంది)

అరుణ భానుడా!

సాకీ : అరుణ భానుడా అసమాన శూరుడా
అస్తమించినావా కామ్రేడ్ ఏచూరీ
చిన్నబుచ్చుకున్నదయ్యో
నువ్వు లేని విప్లవ రహదారి

పల్లవి : అమరుడవైనావా ఏచూరీ
వదలి కదలి పోయావా మము వీడి
అవిశ్రాంత కదనదారీ
ఆరేదెలా మా కంటతడి

చరణం : అత్యాయిక స్థితి నెదిరించగ
విద్యార్థుల కూడగట్టి
అధ్యయనం పోరాటం
నినాదాన్ని అందించి
చదువుతూనె పోరుబాట పరిచావు
ఉద్యమమే ఊపిరిగా జీవించావు
"అమరుడ"

కడు పేదల కష్టాలకు
వేదనతో రగిలినపుడు
సుందరయ్య సహవాసం
చూపెను విప్లవ మార్గం
మార్క్సిజాన్ని అధ్యయనం చేశావూ
మార్పు కొరకు పయనం సాగించావు
"అమరుడ"

సంకీర్ణ కార్యాచరణకు కర్తవు నీవు
చట్టసభలొ సకల జనుల గళమే నీవు
అణగారిన వర్గాల పోరు బావుటా నీవు
వామపక్ష ఉద్యమాలకు సారథివే నీవు
"అమరుడ"



మానవత్వమే మన మతమని చాటావూ
లౌకిక శక్తులకు సిద్ధాంత బలమైనావు
నలుదిక్కుల కదిలావూ నలుగురినీ కలిపావూ
మతోన్మాద శక్తులకూ సింహస్వప్నమయ్యావు "అమరుడ"

విశ్వమెరిగిన స్నేహితుడా
శ్రామిక జన బాంధవుడా
మరణమన్నదే లేదు నీకు కామ్రేడా
ప్రజా ఉద్యమ ప్రస్థానంలో
వెలుగు దారివే విప్లవ సూరీడా "అమరుడ"

– పద్మ వడ్లమూడి

లాల్ సలామ్

కాలపు సెలిమలో ఇంకిపోయిన
బడుగుల సముద్రమా లాల్ సలామ్...
కాలపు తీరంలో కరిగిపోయిన
విప్లవ కెరటమా లాల్ సలామ్...


కాలపు ప్రయాణంలో
ప్రగతి పథివై సాగిన మహానేతా
ప్రశ్నించే ప్రజల గొంతుక లాల్ సలామ్...
ఎర్రజెండా సూర్యతేజమా
ఎజెండాను దేశమంతా చాటిన
కమ్యూనిజ భావసారమా లాల్ సలామ్...

ప్రజల పొద్దై ప్రజాభిమాన ముద్దుయై
కాలపు సడిలో జ్ఞాపక చరితైన
ఏచూరి సీతారామా లాల్ సలామ్...

రాజకీయ క్షేత్రంలో
ప్రజాస్వామ్య పంథాలో
మెరుగైన మేరుశిఖరమై...
ప్రతి హృదయ ఉత్తేజ కిరణమై
మానవత్వ ప్రతిమై
కల్మషంలేని కాంతి పుంజమై
భారత పుస్తకంలో ఏచూరి సీతారామై
ఓ గొప్ప ప్రజా ప్రస్థాన కమ్యూనిజం కొండ
లాల్ సలామ్...
ఎన్నో గుండెల్లో చప్పుడై విలసిల్లిన
ఈ కమ్యూనిజం దిగ్గజమా లాల్ సలాం

– అభిరామ్
9704153642

కూలిన ఒంటినిట్టాడి గుడిసె



"నాకు సాహిత్యమంటే పిచ్చి/ అప్పుడప్పుడూ రాస్తుంటాను/ కనపడ్డ పుస్తకాల్ని కొంటూ వుంటాను/ చిన్న గ్రంథాలయం నా ఇంట్లో / పుస్తకాలు నా మరో ప్రపంచం" నా ఇష్టాలు అనే కవితలో ఈ మాటలు రాసుకున్నది సెప్టెంబర్ 3వ తేదీన హైదరాబాద్‌లో తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసిన కొప్పోలు మోహనరావు. ప్రకాశం జిల్లా కందుకూరు సమీప గ్రామం అయిన చౌటపాలెంలో 22 సెప్టెంబరు 1955లో మోహనరావు జన్మించారు. తల్లిదండ్రులు కొప్పోలు వెంకట సుబ్బమ్మ, మాలకొండయ్య. విద్యార్థిగా చిన్న చిన్న ప్రేమ కవితలు రాసుకున్న మోహనరావు డిగ్రీ చదువుల కోసం కావలి జవహర్ భారతి కొచ్చాక సాహిత్యం పట్ల మరింత మక్కువ పెంచుకున్నారు. వారం వారం బొటానికల్ గార్డెన్‌లో జరిగే 'తెలుగు సాహితి' కార్యక్రమాల్లో ఆసక్తిగా పాల్గొనేవాడు. ప్రతి ఏడాది కాలేజీ మేగజైన్‌లో కవితలు అచ్చయ్యేవి. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, భుజంగరాయ శర్మ, కెవియార్, మధునాపంతుల వంటి ఉద్ధండ పండితులు పనిచేసే కాలేజీ జవహర్ భారతి. శ్రీశ్రీ, కెవియార్, శివసాగర్, చెరబండరాజుల ప్రభావంతో తొలి రోజుల్లో వామపక్ష భావాలతో కవితలు రాసినప్పటికీ, తర్వాతి కాలం అంబేద్కరిజం వైపు మళ్లాడు. డిగ్రీ తర్వాత ఎం.కాం. చదువుతుండగానే కెనరా బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. దాంతో దేశాలు పట్టి తిరగడంతో కవిత్వ సృజన వెనకపట్టింది. అయితే ఎక్కడున్నా డైరీలో కవితలు రాయడం మానలేదు.

1996లో హైదరాబాద్‌కు బదిలీ అయి వచ్చాక మోహనరావుగారి లోని నివురు కప్పిన కవిత్వపు నిప్పు జ్వలించడం మొదలుపెట్టింది. 2005 మే 12–15 – తేదీలలో కవిసంధ్య దళిత రచయితల వేదిక సంయుక్తంగా నిర్వహించిన దళిత రచయితల శిక్షణా శిబిరంలో కీలకపాత్ర పోషించడమే కాక కో–కన్వీనర్‌గా వ్యవహరించారు. దానితో ఎన్నాళ్ళనుంచో అణగారి వున్న కవిత్వ స్ప ృహ దళిత చ్చైతన్యం ఒక్కసారిగా విజృంభించింది. దాని ఫలితమే 2020లో మోహనరావు వెలువరించిన 'ఒంటినిట్టాడి గుడిసె' దళిత కవితా సంకలనం. దీనికి కొలకలూరి భగీరథి కవిత్వ పురస్కారం 2021లోనూ, కవిసంధ్య ప్రతిభా పురస్కారం 2020లోనూ లభించింది. ఆంధ్రప్రభ, నేటినిజం, సాహితీ స్రవంతి, బహుజన కెరటాలు, కవిసంధ్య వంటి పత్రికల్లో మోహనరావు రచనలు అచ్చయ్యాయి. "నా కవితలు నా భావావేశం నుంచి పుట్టుకొచ్చినవి. సామాజికంగా జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ, స్పందిస్తూ, రాసాను" అని మోహనరావే చెప్పుకున్నారు. అంబేద్కరిస్టుగా 'బోధివృక్షం, దళితుడి వాగ్మూలం' వంటి కవితలు రాసిన మోహనరావు వరవరరావుని ఉపా చట్టం కింద అక్రమ అరెస్టు చేసినప్పుడు "కవిని కష్టపెట్టకండ్రా! కాస్త స్వేచ్ఛనివ్వండి/ రేపటి ఉషోదయాన్ని తాను/ భూపాల రాగమై మేల్కొలుపుతాడు' అని రాశాడు. ఒక్క సంపుటే వెలువరించినా మోహనరావు దళిత కవిత్వంలో సాధించింది తన స్థానీయతను నమోదు చేయడం, అతడి యాసను కవిత్వం చేయడం. కవిత్వ రచనలో గొప్ప మూలమలుపులో వున్నప్పుడు మోహనరావు నిష్క్రమించడం' ఒంటి నిట్టాడి గుడెసె నిలువునా కూలిపోయి నట్టయింది. ఖాజా అన్నట్టు "ఎండాకాలపు వొడుస్తున్న కొత్త నీటికుండ" మోహనరావు కవిత్వం! మోహనరావుకు దళిత రచయితల వేదిక అశ్రునివాళి!

– డా. శిఖామణి
9848202526

అరుణ కిరణం

అరుణ కిరణమొకటి అవని విడచి వెళ్లింది
కష్టజీవుల కంటిపాప మింటికెగసి మెరిసింది
ఏడమ్మా ఏడి మా ఏచూరి ఏడంటూ...
పీడిత జనావాళి బోరున ఏడ్చింది..
అందుకో అరుణ తార – ఏచూరీ
మా కన్నీటి వీడ్కోలు కడసారి....

1
తుదిశ్వాస వరకు విప్లవాల బాట నడచి
కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించావు
అందుకో.. కామ్రేడా ఏచూరి
మా అందరి వందనాలు కడసారి... 2
2
పువ్వు పుట్టగానే పరిమళించునన్నట్లు
విధ్యార్థి దశ నుండే ఉద్యమాలు సాగించి
సిద్ధాంత నిబద్ధతకు చిరునామాగా నిలిచి
సిపిఎం నేతవై మా ఎదలో నిలిచావు!
అందుకో. ఏచూరి మా అందరి వందనాలు
3
తెలుగు నేల వారసుడా
ఉద్యమాల శ్రామికుడా
పార్లమెంటు సింగమా పీడిత జన నేస్తమా
అమరుడా ఏచూరి అందుకో.. లాల్ సలాం – 2
సీపీఎం శిఖరమా అందుకో లాల్ సలాం

– ఎస్‌జిఎం బాషా
ప్రజానాట్య మండలి

పోరాటం ఆగదు...

నిండు సూరీడు పశ్చిమాద్రికి జారిపోతే
తూరుపు ఎరుపు మసకబారుతుందా
మాననీయుడు మరో లోకాల కేగిపోతే
మార్క్సిజానికి మార్కులేమైనా తగ్గేనా
ఆజన్మాంతం పోరాడిన ఎర్ర బావుటా
అణగారిన వర్గాల సాక్షిగా అవనతమైతే
అచంచల ఆత్మవిశ్వాసం కణకణలారేనా
కార్మిక కర్షక లోకానికి అండాదండైన
యోధాగ్రేసుడు అమరత్వం పొందితే
సామ్రాజ్యవాద శక్తులపై పోరు ఆగేనా
ప్రజాతంత్ర అభ్యుదయ శక్తుల్ని కొత్తపుంతలు
తొక్కించిన విప్లవోద్యమ ముద్దుబిడ్డ నేడు
నేలకొరిగినా తాడిత పీడిత వర్గాల కోసం
పుట్టిన ఈ యుద్ధం ముగిసినట్టు కాదుగా
లెఫ్టే రైటన్న ఎర్రబాట చెదిరినట్టు కాదుగా
సీతారాముడి పదఘట్టనలో ప్రభవించిన
పోరాట దృక్పథం అహరహం వెలుగులు
చిమ్ముతూ మునుముందుకేగా నడిపించేది
అతడు పూరించిన సమర శంఖం పర్జన్య
గర్జనై నిత్య హెూరుతో పోరెత్తక మానదుగా!

– భీమవరపు పురుషోత్తమ్
99498 00253

రెడ్ సెల్యూట్

ఒక మహావృక్షం కూలిపోయింది
కూలిపోయింది కేవలం వృక్షం మాత్రమే
మర్రివృక్షంలా శాఖోపశాఖలుగా
విస్తరించిన ఆ మహావృక్షం
దేశమంతటా విస్తరిస్తూనే ఉంటుంది

దేశమంతా వేళ్లానుకున్న ఆ వృక్షం
చిగురులు పెట్టి మొలుస్తూనే ఉంటుంది
కూలింది వృక్షం మాత్రమే ... కూకటి వేళ్ళు–
శ్రమజీవుల గుండెలోతుల వరకు విస్తరించి

ఎన్నటికీ సజీవంగా ఉండనే ఉంటాయి
సమాజంలో దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా
పోరాడుతూనే ఉంటాయి

ప్రజా గొంతుకలకు మరణం లేదు
ప్రజా చైతన్య దీపికలై
నిత్యం వెలుగుతూనే ఉంటారు
రెడ్ సెల్యూట్ కామ్రేడ్
మీ గమనం గమ్యం అజరామం

– వినోద్ కుత్తుం
96343 14502

వివాదాల సుడిగుండంలో సెబీ చీఫ్

- ఆది నుండీ అన్నీ ఆరోపణలే



న్యూఢిల్లీ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)... అది స్టాక్ మార్కెట్‌ను నియంత్రించే అత్యున్నత సంస్థ. సెక్యూరిటీలలో పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకు, స్టాక్ మార్కెట్‌ను నియంత్రించేందుకు, దానిని అభివృద్ధి చేసేందుకు కట్టుబడిన దర్యాప్తు సంస్థ. 2022 ఫిబ్రవరి వరకూ సెబీ బోర్డులో హోల్ టైమ్ సభ్యురాలిగా ఉన్న మాధబి పురి బచ్‌ను కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థకు అధిపతిని చేసింది. సెక్యూరిటీల మార్కెట్లను నియంత్రించే సంస్థకు సారథ్యం వహించిన తొలి మహిళ ఆమే. మాధబి న్యూఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుండి గణిత శాస్త్రంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందారు. ఆ తర్వాత అహ్మదాబాద్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యాభ్యాసం చేశారు. 56 సంవత్సరాల వయసులో సెబీ పగ్గాలు చేపట్టారు. తద్వారా ఆ బాధ్యతలు చేపట్టిన అతి పిన్న వయస్కులలో ఒకరుగా నిలిచారు.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో, ఆర్థిక సేవల రంగంలో మాధబి బచ్‌కు విశేష అనుభవం ఉంది. ఆమె ఐసీఐసీఐ సెక్యూరిటీలకు ఎండీగా, సీఈఓగా పనిచేశారు. ఈ అనుభవంతో మాధబి బచ్ సెబీలో తన హోదాకు వన్నె తెస్తారని, పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షిస్తారని అందరూ ఆశించారు. ఐసిఐసిఐలో ఉన్నప్పుడు ఎన్ వాఘల్, కెవి కామత్ పర్యవేక్షణలో విధులు నిర్వర్తించారు. షాంఘైకి చెందిన బ్రిక్స్ ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు కన్సల్టెంటుగానూ వ్యవహరించారు. దానికి కొంతకాలం కామత్ నేతృత్వం వహించారు.

సంవత్సరం గడవక ముందే...

సెబీ అధిపతిగా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం కూడా గడవక ముందే మాధబి బచ్‌పై ఆరోపణలు మొదలయ్యాయి. అదానీ గ్రూప్ కంపెనీలు తమ వాటాల విలువను పెంచి చూపేందుకు అవకతవకలకు పాల్పడ్డాయంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ ఆరోపించడంతో ఆమెకు కష్టకాలం ప్రారంభమైంది. హిండెన్‌బర్గ్ ఆరోపణలతో అదానీ గ్రూప్ కంపెనీల వాటాల విలువ భారీగా పతనమైంది. కొన్ని ట్రేడింగ్ సెషన్స్‌లోనే వందల కోట్ల రూపాయల మదుపరుల సంపద ఆవిరై పోయింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సిందిగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి.

పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు

అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలను దర్యాప్తు చేయడంలో సెబీ వైఫల్యంపై కమిటీని ఏర్పాటు చేయాలని గత సంవత్సరం మార్చిలో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు విషయంలో సెబీ వైఫల్యం ఏమీ లేదని సుప్రీం నియమించిన కమిటీ తేల్చింది. మేలో తన నివేదికను అందజేసింది. హిండెన్‌బర్గ్ నివేదికలో చూపిన 13 సంస్థల యాజమాన్యంపై సెబీ 2020 అక్టోబర్ నుండే దర్యాప్తులు జరుపుతోందని తెలిపింది. దీంతో వివాదం చల్లారినట్లు కన్పించినప్పటికీ గత నెల 10న హిండెన్‌బర్గ్ మరో బాంబు పేల్చింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి మాధబి బచ్‌పై ఆరోపణలు చేసింది. అదానీలతో సంబంధమున్న మారిషస్ ఆఫ్‌షోర్ ఫండ్‌లో బచ్ పెట్టుబడులు పెట్టారని తెలిపింది. అయితే హిండెన్‌బర్గ్ ఆరోపణలను మాధబి బచ్, ఆమె భర్త ధావల్ బచ్ తోసిపుచ్చారు. ఆ ఆరోపణలలో ఎంతమాత్రం వాస్తవం లేదని, తమ జీవితం, ఆర్థిక వ్యవహారాలు తెరిచిన పుస్తకాలేనని వివరించారు. కొన్ని సంవత్సరాలుగా అవసరమైన అన్ని వివరాలనూ సెబీకి అందజేస్తూనే ఉన్నామని చెప్పారు. ప్రైవేటు పౌరులుగా ఉన్నప్పటి డాక్యుమెంట్లు సహా అన్ని ఆర్థిక పత్రాలనూ ఏ సంస్థకైనా బయటపెట్టేందుకు వెనకడుగు వేయబోమని తెలిపారు.

తిరగబడుతున్న అధికారులు

అటు సెబీ కూడా ఆగస్ట్ 11న ఓ ప్రకటన విడుదల చేసింది. సెక్యూరిటీలు, వాటి బదిలీలకు సంబంధించి ఛైర్‌పర్సన్ ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూనే ఉన్నారని, పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాల దర్యాప్తు నుండి ఆమె తనంతట తానుగా వైదొలిగారని చెప్పుకొచ్చింది. సెబీ జరిపిన ఏ దర్యాప్తునూ ప్రభావితం చేసేందుకు బచ్ ప్రయత్నించలేదని దాని పనితీరుతో సంబంధమున్న వ్యక్తులు కూడా తెలియజేశారు. అయితే పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారాలపై సెబీ దర్యాప్తు జరిపినప్పుడు మాధబి బచ్ తన బాధ్యతల నుండి వైదొలగలేదని పేరు చెప్పడానికి ఇష్టపడని బోర్డు సభ్యుడొకరు స్పష్టం చేశారు. ఇదిలావుండగా సెబీలో పనిచేస్తున్న పలువురు అధికారులు మాధబి ప్రవర్తనపై మండిపడుతున్నారు. అత్యున్నత స్థాయిలో ఉన్న వారు ఉద్యోగులను నమ్మడం లేదని, వారిని గౌరవించరని, పని ప్రదేశంలో విష సంస్కృతి నెలకొన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెబీ ప్రధాన కార్యాలయం వద్ద ప్రదర్శన కూడా నిర్వహించారు.

స్వతంత్ర సమీక్ష అత్యవసరం

సెబీ ప్రయోజనాల కోసం, పెట్టుబడిదారులలో విశ్వాసం నింపడం కోసం మాధబి బచ్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలపై సాధ్యమైనంత త్వరగా స్వతంత్ర సమీక్ష జరిపించి, అపోహలు తొలగించాల్సిన అవసరం ఉన్నదని మాజీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. అది ఆమె ప్రయోజనాలకు కూడా మంచిదని అంటూ తన జీవితం తెరచిన పుస్తకం అన్న మాధబి మాటలను ఆయన గుర్తు చేశారు.



సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏచూరి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న స్టాలిన్

జీవితాంతం ప్రజల హక్కుల కోసం పోరాడిన యోధుడు ఏచూరి

- తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఘన నివాళి

చెన్నయ్ : కమ్యూనిస్టు యోధ సీతారాం ఏచూరికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఘన నివాళులర్పించారు. చెన్నయ్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏచూరి చిత్ర పటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. స్టాలిన్‌తో పాటు సిపిఐ, డిఎంకె, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు, వివధ ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ జీవితాంతం ప్రజల హక్కుల కోసం పోరాడిన యోధుడు ఏచూరి అని జోహార్లు అర్పించారు. వైద్య విద్యా బోధన కోసం తన దేహాన్ని దానం చేసి మరణానంతరం కూడా ప్రజా సేవలో పరితపించిన చిరస్మరణీయ స్ఫూర్తిదాయక నేత అని కొనియాడారు. డిఎంకె ఎంపీ కనిమొళి మాట్లాడుతూ దేశంలోనే గొప్ప నాయకులు ఏచూరి అని, ఆయనకు తమ పార్టీ తరుపునే కాకుండా వ్యక్తిగతంగానూ తాను ఘన నివాళులర్పిస్తున్నానని తెలిపారు. ఏచూరి మరణం ఒక రాజకీయ రంగానికే కాకుండా దేశ మేధో రంగానికే తీరని లోటు అని చెప్పారు. భావి తరాలకు గొప్ప స్ఫూర్తి ప్రదాత ఏచూరి అని స్మరించకున్నారు. రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ కూడా ఏచూరికి ఘన నివాళులర్పించారు. ఏచూరి లాంటి అతి కొద్దిమంది మాత్రమే తమ జీవితాలను సర్వం ప్రజల కోసమే త్యాగం చేస్తారని కొనియాడారు. ఏచూరి తనకు ఆప్త మిత్రుడుని, రాజ్యసభలో అనేక గంటల పాటు వివిధ అంశాలపై చర్చలు జరిపేవారమని సిబల్ గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

మహిళా కాంగ్రెస్‌కు 40 ఏళ్లు

- రాహుల్ గాంధీ ప్రశంసలు

న్యూఢిల్లీ : అఖిల భారత మహిళా కాంగ్రెస్ (ఎఐఎంసి) ఆదివారం 40వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంది. ఈ సందర్భంగా ఎఐఎంసి నాయకులు, సభ్యులపై కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రశంసలు కురిపించారు. గత 40 ఏళ్ల నుంచి న్యాయం కోసం భయంలేని స్వరాన్ని ఎఐఎంసి వినిపిస్తోందని అన్నారు. అలాగే 40వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో సభ్యత్వ నమోదును ప్రారంభించినందుకు ఎఐఎంసిని రాహుల్ అభినందించారు. 1984 కాంగ్రెస్ బెంగళూరు మహాసభలో ఎఐఎంసి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీల్లో అత్యంత చురుకైన సంస్థగా ఉందన్నారు.

రాజస్థాన్‌లో దారుణం

- దళిత బాలుడితో బలవంతంగా 'నగ్నంగా నృత్యం'

జైపూర్ : దొంగతనం చేశాడని ఆరోపిస్తూ, ఒక 12 ఏళ్ల దళిత బాలుడితో పెత్తందార్లు బలవంతంగా నగ్నంగా నృత్యం చేయించిన దారుణ ఘటన రాజస్థాన్‌లో చోటు చేసుకుంది. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాలుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆరుగుర్ని అరెస్టు చేశారు. వీరిలో తండ్రీకొడుకులు కూడా ఉన్నారు. ఫిర్యాదు ప్రకారం శుక్రవారం రాత్రి జిఎడి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఒక హాస్య కార్యక్రమానికి బాధితుడు హాజరయ్యాడు. అయితే ఒక సంగీత సంస్థకు ఆరుగురు వ్యక్తులు తమ మ్యూజిక్ సిస్టమ్ నుంచి వైర్‌ను దొంగలించాడని ఆరోపిస్తూ బాధితుడిపై దాడికి దిగారు. వివస్త్రుడ్ని చేసి బలవంతగా నృత్యం చేయించారు. పైగా దాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు.

సిబిఐ కస్టడీకి ఆర్‌జి కర్ మాజీ ప్రిన్సిపాల్

కొల్‌కతా : జూనియర్ డాక్టర్ హత్యాచారానికి సంబంధించిన కేసు, ఆర్థిక అక్రమాలకు సంబంధించిన కేసుల్లో ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్‌స్టేషన్ ఆఫీసర్ ఇన్ ఛార్జ్ అభిజిత్ మోండల్‌ను ఈ నెల 17 వరకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) కస్టడీకి అప్పగిస్తూ స్థానిక కోర్టు ఆదివారం ఉత్తర్వులు వెలువరించింది. ఆసుపత్రిలో ఆర్థిక అక్రమాలకు సంబంధించిన ఈ నెల 2న సందీప్ ఘోష్‌ను అరెస్టు చేయగా, అభిజిత్‌ను గత శనివారమే సిబిఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న ఈ ఇరువురిని ఆదివారం కోర్టులో ప్రవేశపెట్టి మూడు రోజుల పాటు తమ కస్టడీకి పంపాల్సిందిగా సిబిఐ సిబిఐ విజ్ఞప్తి చేసింది. దీంతో న్యాయస్థానం ఇరువురు నిందితులను ఈ నెల 17 వరకు సిబిఐ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మోండల్ సాక్ష్యాలను తారుమారు చేయడంతో పాటు, ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేయడంలోనూ ఆలస్యం చేశాడని సిబిఐ వాదనలు వినిపించింది. విచారణ సమయంలో 'సరైన సమాధానాలు ఇవ్వడంలో విఫలమైనందుకే మోండల్‌ను అరెస్టు చేసినట్లు పేర్కొంది. ఆగస్టు 9న ఉదయం 10 గంటల సమయంలో డాక్టర్ మరణించినట్లు మోండల్‌కు సమాచారం వస్తే రాత్రి 11 గంటలకు ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేశారని తెలిపింది. హత్యాచార ఘటనను తక్కువ చేసి చూపడానికి, ఘోరమైన నేరాన్ని 'రక్షించేందుకు' ఘోష్, మోండల్ యత్నించారని పేర్కొంది.

చర్చలు విఫలం

ఆర్‌జి కేర్ ఆసుపత్రి హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా... ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లతో బెంగాల్ ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. చర్చల్లో సిఎం మమతా బెనర్జీ పాల్గొనడం సహా వాటిని ప్రత్యక్ష ప్రసారం చేయాలని జూనియర్ వైద్యులు విధించిన షరతులను, బెంగాల్ ప్రభుత్వం తోసిపుచ్చింది. ఆర్‌జి కేర్ వైద్య కళాశాలలో హత్యాచారానికి గురైన వైద్యురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.... బంగాల్ వ్యాప్తంగా జూనియర్ విద్యార్థులు దాదాపు 33 రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో..... వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు బైఠాయించిన ఆందోళనకారులతో చర్చలు జరిపేందుకు మమత సర్కార్ సిద్ధమైంది. చర్చల్లో పాల్గొనేందుకు 30 మంది ప్రతినిధులకు అనుమతి ఇవ్వాలని, బహిరంగ వేదికపై చర్చ జరపాలని, వాటిని ప్రత్యక్ష ప్రసారం చేయాలని వైద్యులు షరతులు విధించారు. ఈ షరతులు రాజకీయ ప్రేరేపితంగా ఉన్నాయని, బెంగాల్ ఆరోగ్యశాఖ సహాయ మంత్రి చంద్రిమా భట్టాచార్య ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

రోహింగ్యాల చొరబాటుతో

జార్ఖండ్‌కు పెను ముప్పు

- జార్ఖండ్ పర్యటనలో ప్రధాని మోడీ

రాంచీ : బంగ్లాదేశీయులు, రోహింగ్యాల చొరబాట్లతో జార్ఖండ్‌కు పెను ముప్పు పొంచివుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జార్ఖండ్‌లో ఆయన ఆదివారం పర్యటించారు. జెంషెడ్‌పూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో జెఎంఎం నేతృత్వ కూటమి ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం చొరబాట్లను ప్రోత్సహింస్తోందని ఆరోపించారు. చొరబాట్లతో సంతాల్ పరగణాలు, కోల్హాన్ ప్రాంతాల్లో జనాభాల స్వరూపం మారిపోయిందని మోడీ అన్నారు. ఈ ప్రాంతాల్లో గిరిజన జనాభా క్షీణించిందని మోడీ చెప్పారు. అలాగే, 'ఈ ప్రాంతాల్లో చొరబాటుదారులు పంచాయితీ వ్యవస్థను అదుపులోకి తెచ్చుకున్నారు.

భూములు లాక్కొంటున్నారు. ఆడపిల్లలపై అఘాత్యాలతో సహా అరాచకాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో ప్రతీ పౌరుడు అభద్రతా భావంలో ఉన్నారు' అని ప్రజలను భయాందోళనలకు గురిచేలా మోడీ ప్రసంగించారు. జార్ఖండ్‌కు జెఎంఎం, ఆర్‌జెడి, కాంగ్రెస్ అతి పెద్ద శత్రువులని, ఈ పార్టీలు అధికార వ్యామోహం, ఓటు బ్యాంకు రాజకీయాల్లో మునిగిపోయాయని ఆరోపించారు.



ఆరు వందే భారత్ రైళ్లు ప్రారంభం

రాంచీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆరు వందేభారత్ రైళ్లను ప్రధానమంత్రి మోడీ వర్చుల్‌గా ప్రారంభించారు. జార్ఖండ్, ఒడిషా, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలను ఇవి అనుసంధానం చేస్తాయి. టాటానగర్-పాట్నా, బ్రహ్మపుర-టాటానగర్, రూర్కెల-హౌరా, దేవ్‌గఢ్-వారణాసి, భగల్పూర్-హౌరా, గయ-హౌరా మార్గాల్లో ఈ రైళ్లు నడవనున్నాయి. కాగా ప్రధానమంత్రి అవాస్ యోజన -గ్రామీణ (పిఎంఎవై-జి) పథకం కింద దేశవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం కోసం రూ.32 వేల కోట్లను ప్రధాని ఆదివారం వర్చువల్‌గా విడుదల చేశారు.

నాలుగేళ్లుగా జైలులోనే

- 'ఉపా' కేసులో విచారణ పేరిట ఉమర్ ఖలీద్‌కు వేధింపులు



న్యూఢిల్లీ : జవహార్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) మాజీ విద్యార్థి సంఘం నాయకుడు, విద్యార్థి ఉద్యమ నేత ఉమర్ ఖలీద్ నాలుగేళ్లుగా జైలులోనే మగ్గుతున్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) కేసులో విచారణ పేరిట ఆయనను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 2020లో ఈశాన్య ఢిల్లీలో చోటు చేసుకున్న మతపరమైన అలర్లకు సంబంధించి ఉమర్ ఖలీద్ ఆ ఏడాది సెప్టెంబర్‌లో అరెస్ట్ అయిన విషయం విదితమే. అయితే, ఆయన అప్పటి నుంచి జైలులోనే ఖైదుగా ఉన్నారు. విచారణ కోసం ఇలా ఆయన నాలుగేళ్ల విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని విద్యార్థి నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2020 ఫిబ్రవరిలో హింసాత్మక అల్లర్ల ఆరోపణలపై డిసెంబర్, 2022లో న్యాయస్థానం ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. అయినప్పటికీ, ఉపా కింద దాఖలైన ఇంకో కేసులో ఆయన జైలులోనే మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు సందర్భాల్లో బెయిల్ కోసం ఆయన చేసిన ప్రయత్నాలనూ కోర్టులు తిరస్కరించాయి కూడా. ఉపా చట్టంలోని పలు నిబంధనల రాజ్యాంగ చెల్లుబాటును కూడా సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో ప్రత్యేక పిటిషన్‌ను దాఖలు చేశారు. అది కూడా పెండింగ్‌లో ఉన్నది.

తన పౌరులను తానే చంపుతున్న ఇజ్రాయిల్

- నెతన్యాహూ సైనిక దాడుల్లోనే బందీల మృతి

రఫా : ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి తన సొంత ప్రజలు కూడా బలైపోతున్నారు. ప్రపంచ దేశాలన్నీ దాడులు ఆపేయాలని కోరినా.. అమెరికా, యూరప్ దేశాల అండదండలతో మితవాద ప్రధాని నెతన్యాహూ ప్రభుత్వం గాజాపై అమానవీయ దాడులకు తెగబడుతూనేవుంది. వైమానిక దాడులతో విరుచుకుపడుతూ నిత్యం వేలాది మంది అమాయక పాలస్తీనియన్లను బలి తీసుకుంటోంది. వీరిలో అత్యధిక మంది చిన్నారులూ, మహిళలే కావడం దుర్మార్గం. కాగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడుల్లో తన సొంత పౌరులను కూడా బలితీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాలస్తీనా సాయుధ బలగాల చేతిలో బంధీలుగా ఉన్న ఇజ్రాయిల్ పౌరుల్లో గతేడాది నవంబరులో ముగ్గురు చనిపోయినట్లు నెతన్యాహూ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. అయితే ఆ ముగ్గురు కూడా ఇజ్రాయిల్ సైన్యం గాజాపై జరిపిన క్షిపణిదాడుల వల్లే చనిపోయారని నెతన్యాహూ సైన్యం ఆదివారం ప్రకటించింది. ఆ ముగ్గురు బంధీల మృతదేహాలను గతేడాది డిసెంబరులోనే ఇజ్రాయిల్‌కు తరలించారు. చనిపోయిన బంధీలను కార్పొరల్ నిక్ బేయిజర్, సర్జంట్ రాన్ షెర్మాన్, ఫ్రెంచ్ ఇజ్రాయిలీ ఎలియా టోలెడానోగా గుర్తించారు. వీరి భౌతికకాయులకు పోస్టుమార్టం నిర్వహించగా దిగ్భ్రాంతికర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఇజ్రాయిల్ ఆరోపిస్తున్నట్లుగా వారంతా పాలస్తీనా సాయుధుల చేతిలో చనిపోలేదని, ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లోనే చనిపోయారని నిర్ధారణ అయ్యింది. శక్తివంతమైన ఐడిఎఫ్ క్షిపణిదాడిలోనే ఈ ముగ్గురు చనిపోయినట్లు తేలిందని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. హమాస్ నార్తరన్ బ్రిగేడ్ కమాండర్‌ను చంపే లక్ష్యంతో ఇజ్రాయిల్ సైన్యం గతేడాది నవంబరు 10న వైమానిక దాడులకు పాల్పడింది. ఆ దాడుల్లోనే ఈ ముగ్గురు ఇజ్రాయిల్ పౌరులు కూడా చనిపోయినట్లు సైన్యం తెలిపింది.



గాజా స్ట్రిప్‌లోని రఫాలో ఇజ్రాయిల్ పౌరులను బంధించినట్లుగా చెబుతున్న ఒక టన్నెల్ ప్రవేశం వద్ద దర్యాప్తు చేస్తున్న నెతన్యాహూ సైన్యం



సంప్రదాయం, ఆధునికత మేళివింపుతో ఓనం వేడుకలు

- కేరళ ప్రజలకు రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

తిరువనంతపురం : సంప్రదాయం, ఆధునికత మేళవింపుతో ప్రపంచవ్యాప్తంగా కేరళీయులు ఆదివారం ఘనంగా ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఓనం సందర్భంగా కేరళ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, గవర్నర్ ఆరిఫ్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృత్తి విపత్తుల నేపథ్యంలో ఈ ఏడాది ఓనం వేడుకలను సాధ్యమైనంత మేరకు కుదించుకోవాలని విజయన్ ఈ సంరద్భంగా ప్రజలకు సూచించారు. జులైలో వాయనాడ్‌లో కొండచరియులు విరిగిపడిన నేపథ్యంలో అక్కడి ప్రజలకు సంఘీభావంగా ఓనం అధికారిక వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. కేరళ రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లను, ఇళ్ల ముందు పూలతో అలంకరణ చేసి, సామూహిక ఆటలు ఆడుతూ బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటూ సంబరాలు చేసుకున్నారు. పండుగ ఉత్సాహం ప్రతీ వీధిలోనూ కనిపించింది. సంప్రదాయ ఆటలతో పాటు ఆర్మ్ రెజ్లింగ్, పోల్ క్లైంబింగ్, లాగ్ పిల్లో ఫైట్ వంటి పోటీలను క్లబ్‌లు, రెసిడెంట్ అసోసియేషన్లు నిర్వహించాయి. అలాగే పంట పొలాల్లో ఆడే ఓలా పంతు, కుట్టియం కోలుం వంటి ఆటలను ఉత్సాహంగా జరిపారు. తిరువనంతపురంలోని చారిత్రాత్మకమైన కనకకున్ను ప్యాలెస్‌లో సంగీత కచేరీలు, నృత్యాలు, లైట్ అండ్ సౌండ్ షోలు, జానపద కళా ప్రదర్శనలు నిర్వహించారు.

గల్ఫ్, అమెరికా, ఇంగ్లండ్, ఐరోపా వంటి విదేశాల్లో స్థిరపడిన కేరళీయులు కూడా ఓనం వేడుకలను నిర్వహించుకున్నారు. వివిధ మలయాళీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఓనం పండుగలో పరోపకార చర్యలు కూడా ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఆసుపత్రులు, అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాల్లో పండ్లతో సహా వివిధ వస్తువులను అనేక స్వచంధ సంస్థలు, వ్యక్తులు పంపిణీ చేశారు. తిరువనంతపురంలోని సెంట్రల్ జైలు కూడా ఓనం వేడుకలకు సాక్షిగా నిలిచింది. ఇక్కడ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సుమారు 1600 మంది ఖైదీలకు విందు ఏర్పాటు చేశారు.

అర్ధ శతాబ్దిగా అనామక బతుకులు

- పౌరసత్వం లేకుండానే హిందూ శరణార్థులు

న్యూఢిల్లీ : దాదాపు అర్ధ శతాబ్ది కింద బంగ్లాదేశ్ (ఆ సమయంలో తూర్పు బెంగాల్) నుంచి భారత్‌లోకి ప్రాణభయంతో తరలి వచ్చిన హిందూ శరణార్థులు ఒక గుర్తింపు లేకుండానే జీవనాన్ని గడుపుతున్నారు. వీరంతా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి మధ్య భారత్‌లోని అటవీ ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ అటవీ ప్రాంతాల్లోని మావోయిస్టు రెడ్ కార్నర్ జోన్లలో ఉన్న మొత్తం 300 శిబిరాల్లో 2.8 లక్షల మంది హిందూ శరణార్థులు తలదాచుకుంటున్నట్టు సమాచారం. ఆ సమయంలో తూర్పు బెంగాల్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కాలి నడకనే తాము భారత్‌కు వచ్చామని వారు చెప్తున్నారు. అయితే, తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కూడా దక్కలేదని అంటున్నారు.

పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లోని మైనారిటీలు (ముస్లిమేతరులు) మత పీడనకు గురై, భారత్‌కు శరణు కోరి వస్తే వారికి పౌరసత్వం కల్పించే చట్టం సిఎఎను మోడీ సర్కారు తీసుకొచ్చిన విషయం విదితమే. ప్రత్యేకించి హిందూత్వ వాదానికి తామే ఐకాన్ అంటూ చెప్పుకునే బిజెపి.. సిఎఎ కింద వారికి పౌరసత్వాన్ని ఎందుకు కల్పించలేకపోయిందని కొందరు రాజకీయ పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో వచ్చి స్థిరపడిన శరణార్థులకు అక్కడి ఆదివాసీల నుంచి తొలుత మద్దతు లభించినా.. కొన్ని విద్రోహ శక్తుల ప్రయత్నాలతో సెటిలర్లు అనే భావన వారిలో నెలకొన్నదని బాధితులు వాపోతున్నారు. 'మేము ఇక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్నాం. ఇప్పటికీ గుర్తింపు కోసం ఎదురు చూస్తున్నాం" అని నిఖిల్ భారత్ బెంగాలీ సమన్‌భే సమితి (ఎన్‌బిబిఎస్‌ఎస్) సభ్యులు బిపిన్ బేపారి తెలిపారు. సిఎఎ కింద 221 దరఖాస్తులు అందగా.. ఆరు మాత్రమే ఆమోదింపబడ్డాయని చెప్పారు. అడవుల్లో తలదాచుకుంటున్న తమ వేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని, తమకు పౌరసత్వం కల్పించే ప్రయత్నాన్ని చేయాలని ఆయన కోరుతున్నారు.



మీకోసం

తేనె శుభ్రంగా నిల్వ ఉండాలంటే.. మంచి సీసాలో పోసి అందులో రెండు, మూడు లవంగాలు వెయ్యాలి.

జీవన సౌరభం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

మహిళా మణిపూస లక్ష్మీదేవమ్మ



లక్ష్మీదేవమ్మ (ఫైల్)

మహిళా ఉద్యమనేత, మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి ప్రాంతంలో పార్టీ నిర్మాణానికి కృషి చూసి లక్ష్మీదేవమ్మ ఈనెల 13వ తేదీన కన్నుమూశారు. చిన్నప్పటినుంచి తుదిశ్వాస విడిచేదాకా ఆమె ప్రజాపక్షంగానే ఉన్నారు. నమ్మిన సిద్ధాంతానికి అనుగుణంగానే జీవితాన్ని గడిపారు.

మహబూబ్‌నగర్ జిల్లా మహిళా ఉద్యమ నిర్మాతల్లో లక్ష్మీదేవమ్మ ఒకరు. మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా ఆ ప్రాంత సమస్యలపై మహిళలను కదిలించి అనేక ఉద్యమాలు నడిపారు. 1987లో జిల్లాలో కరువు విలయ తాండవం చేస్తుంటే కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 16 గ్రామాల్లో అంబలి కేంద్రాలు నిర్వహించింది. లక్ష్మీదేవమ్మ మహిళా దళాల ద్వారా నగదు, వస్తు రూపేణా సేకరించి అంబలి కేంద్రాలకు సరఫరా చేశారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీ మహిళలకు అతి తక్కువ కూలి ఇచ్చి భూస్వాములు వారి శ్రమను దోచుకుంటుంటే గ్రామ గ్రామాన రోజుల తరబడి కూలీ పేటల్లో నివసిస్తూ కూలీలను సంఘటిత పరిచి విజయాలు సాధించారు. దీనికి ప్రేరణ గోదావరి పరులేకర్ రాసిన 'వర్లీ ఆదివాసుల తిరుగుబాటు' పుస్తకం అనేవారు. ఉద్యమాల్లో పని చేస్తున్న ప్రతి ఒక్కనూ ఆ పుస్తకం చదవాలనేవారు. వివిధ సందర్భాల్లో కార్యదర్శిగా ఉన్న ఎంహెచ్ గారికి నిధిని పంపేవారు.

చిన్నతనం నుండి చదివే అలవాటు ఉన్న లక్ష్మీదేవమ్మ చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాలు గ్రంథాలయాలకు వెళ్ళి చదివేవారు. హైస్కూల్ హెడ్ మాస్టర్ ప్రతి వారం స్కూల్ లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తెచ్చుకుని చదవాలని నిబంధన పెట్టడంతో పుస్తక పఠనం అనే అలవాటు ఆమె జీవితాంతం కొనసాగింది. వీరేశలింగం, గురజాడ, ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలైన వారి అభ్యుదయ సాహిత్యాన్ని చదివి హేతువాద దృక్పథాన్ని అలవరుచుకున్నారు. విద్యార్థి దశలో విద్యార్థి చురుకుగా పని చేశారు. 'వర్లీ ఆదివాసుల తిరుగుబాటు, జెన్నీ మార్క్స్' వంటి పుస్తకాలు చదివారు. ప్రజల్లో పని చేయాలనే దృఢ సంకల్పం మరింత బలపడింది.. 80 సంవత్సరాల వయస్సులోనూ ఆమె పత్రికలు, సాహిత్యం చదవటంలో నిత్య పాఠకురాలిగానే ఉన్నారు.

1958లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం పొందారు. 'అమ్మ' నవల చదివి 'పావెల్' లాంటి కొడుకును తయారు చేయాలని, ఆ పద్ధతిలో పిల్లల్ని పెంచింది. చిన్న కుమారుడు అర్జున్, మనమరాలు మమత ఆమె ఆశయాలకు అనుగుణంగా సిపిఎంలో క్రియాశీల పాత్రలో ఉన్నారు.

ఆమె ఉద్యమకారిణే కాదు; రచయిత్రి కూడా. మా అమ్మమ్మ కథ, పట్నంలో బతుకుదామని, గుర్తు కొస్తున్నాయి పేరిట పుస్తకాలు రాశారు. దిన పత్రికలకు, చైతన్య మానవికి వ్యాసాలు రాసేవారు. ఆమె రాసిన పుస్తకాలు, వ్యాసాల్లో 1950, 60 ల నుంచి ఈనాటి వరకు ఉన్న సామాజిక జీవన పరిస్థితులు, మహిళల సామాజిక కట్టుబాట్లు, వాటిని ఛేదించుకుని మహిళలు అన్యాయాలను ఎదిరించటాన్ని మనకు కళ్ళకు కట్టినట్లు చూపించారు. తన అమ్మ చనిపోయినపుడు వారసులమని తలకొరివి పెట్టటానికి ముందుకు వస్తే ఆ హక్కు తనకూ వుందని ఆమే చితికి నిప్పంటించి ఆదర్శంగా నిలిచారు.

ప్రతి రచనలోనూ సామాజిక అంశాలతో పాటు, కుటుంబ సంబంధాల్లో వస్తున్న మార్పులు, పిల్లల పెంపకం గురించి, మూఢవిశ్వాసాలు, సాంఘిక దురాచారాలు, స్త్రీల అభ్యున్నతికి ఎలా ఆటంకంగా మారుతున్నాయో వాటిని పెంచి పోషిస్తున్న పాలకులు, మీడియాలో వస్తున్న పెడధోరణులను విమర్శిస్తూ రాశారు. మహబూబ్‌నగర్ జిల్లా వాసులు పొట్ట కూటి కోసం వృద్ధులను ఇంటి వద్ద వదిలి పట్నాలకు వలస పోవటాన్ని వారి బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టినట్లు అక్షరబద్ధం చేశారు. ఆమె రచనా శైలి పాఠకులు సులభంగా చదువుకునేలా చేస్తుంది. ప్రతి రచనలో సందేశాత్మకంతో పాటు కర్తవ్య బోధన ఉంటుంది. ఆమె మోటూరు ఉదయం ట్రస్టు నిర్వహిస్తున్న మహిళా న్యాయ సలహాసంఘానికి కన్వీనర్‌గా పనిచేశారు. ప్రతి శనివారం లీగల్ సెల్‌కు వచ్చి భార్యాభర్తల సమస్యలు ఎంతో ఓర్పుతో, ఓపికగా పరిష్కరించేవారు.

ఆమెకు చిన్నప్పుడే వివాహం జరిగినా పిల్లలు పుట్టాక చదువుకు కొనసాగించారు. అనేక పుస్తకాలు చదివారు, రాశారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. భర్త శ్రీహరి ప్రజాపోరాటాల్లో భాగంగా అరెస్టయి, జైళ్లలో ఉంటే ధైర్యంగా కుటుంబాన్ని ముందుకు నడిపించారు. ఉద్యమానికి అండగా నిలబడ్డారు. ఈ లక్షణాలన్నీ ఈతరం వారు అలవర్చుకోవాల్సినవి. ఆమె భౌతికంగా మనమధ్య లేకపోయినా నిత్య స్ఫూర్తి ప్రదాత.


– కె.స్వరూపరాణి

కొన్ని జీవిత విశేషాలు

- మా బ్యాచ్ అందరం ఎంతో అల్లరి చేస్తూ కూడా 7వ తరగతి బోర్డు పరీక్షల్లో పాస్ అయ్యాము. మా స్కూలు ఏడు వరకే ఉండేది. మా వూర్లో హైస్కూల్ ఉంది కానీ అది కో ఎడ్యుకేషన్. దీనికి ఇష్టపడని తల్లిదండ్రులు ఏడవ తరగతితోటే చదువు మాన్పించేవారు. కానీ నాన్నకు ఏ సంకుచిత ఆలోచనలు లేవు. కనుక నన్ను హైస్కూలుకు పంపడానికే ఇష్టపడ్డాడు.
- ఒకరోజు ఉదయం నేను స్కూలుకు తయారవుతున్నాను. నాన్న ఒకరితో ఒక చీటీ పంపించాడు. దాంట్లో నన్ను స్కూలుకు వెళ్ళవద్దని, నన్ను చూడడానికి ఎవరో వస్తున్నారని రాశాడు. ఒక్కసారి మిన్ను విరిగి మీద పడ్డట్లయింది. పెళ్ళి చూపులకొచ్చేవాడు బి.ఎ. చదువుతున్నాడనగానే నన్ను బి.ఎ. దాక చదివిస్తానన్నది మర్చిపోయాడు నాన్న. నా పెళ్ళి చూపుల పేరుమీద ఆయన ముందు కూచోవడం ఇష్టంలేదు. అలా నేను కూచోను అని గట్టిగ చెప్పాను. సరే నన్ను ఎలాగైన బయటికి రప్పించాలని మా మేనమామ 'నీ స్నేహితురాలు వసుంధర వచ్చింది' అని చిన్న అబద్ధమాడారు. నిజమే అనుకొని నేను వడివడిగా హాలులోకి వచ్చాను. అప్పుడు ఆయననన్ను చూశారేమో!
- 1958లో కామ్రేడ్ సుందరయ్య గారు వనపర్తిలో పార్టీ ప్రారంభించాలని శ్రీహరి గారిని ఆదేశించారు. అప్పటికే నా పెద్ద కూతురు అరుణ పుట్టింది. సుందరయ్య గారి ఆదేశం వినగానే ఎగిరిగంతేశాను. మా పుట్టింటికి చేరుకొని ఆగిపోయిన చదువును పూర్తి చేసుకోవచ్చని ఆనందపడిపోయాను. వనపర్తికి వచ్చాం. అనుకున్నట్లుగా మళ్లా స్కూల్లో 10వ తరగతిలో జాయిన్ అయ్యాను.
- శ్రీహరి గారు పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. 1958లో నేను పార్టీ సభ్యురాలిని అయ్యాను. టౌన్ కమిటీలోకి తీసుకున్నారు. వనపర్తి చుట్టుపక్కల గ్రామాల్లో పార్టీ బలపడుతున్న రోజులవి. వనపర్తికి కరెంటు లేదు. (అంటే రాజుల కాలం నాటి కరెంటే) ప్రభుత్వపరంగా కరెంటు కావాలని పార్టీ పెద్ద ఉద్యమమే నడిపింది. ఫలితంగా వనపర్తికి కరెంటు శాంక్షన్ అయింది.
- ఒకరోజు అర్ధరాత్రి డిఫెన్సు యాక్టు కింద దేశవ్యాప్తంగా 1,000 మంది కమ్యూనిస్టులను అరెస్టు చేసింది కర్కశ ప్రభుత్వం. దీనిలో భాగంగానే శ్రీహరి అర్ధరాత్రి వరకు ఇంటికి రాలేదు. తెల్లవార్లు ముగ్గురు పిల్లలతో ఎదురు చూస్తూ కూర్చున్నాను.. తెల్లారిన తర్వాత ప్రభుత్వం అరెస్టు వార్తలను చెప్పింది.

(లక్ష్మీదేవమ్మ గారి 'నా కథ' పుస్తకం నుంచి)

ఆట, విజ్ఞానానికి బాట



బాల్యంలో ఆడుకున్న ఆటలు
అప్పటికి సరదాకే అయినా..
అవో పరిశోధనలు అని
ఇప్పటికి గానీ తెలియరాలే!

సూర్యకాంతిని అడ్డగించి
భూతద్దంతో మళ్ళించి
సినిమా 'రీలు' ప్రతిబింబాన్ని
ఇంటి గోడపై మురిపించాం

కొబ్బరి రేకుల అల్లికతో
'గురిగొట్టాలను' తయారుచేసి
ఆకాశ వీధిన అన్వేషణకు
చిరుప్రాయంలోనే తెరలేపాం

వాన నీటి ధారల మధ్య
లోతునైన చారలు గీసి
నదులను కలిపే ప్రాజెక్టులు
ఊహ తెలియని కాలం నాటివే

కళ్ళకు గంతలు కట్టి తిప్పి
వేళ్ళను చూపి లెక్కలు అడిగి
చకచక చెప్పిన కృత్రిమ మేధ
బడి వయస్సులోనే మొదలెట్టాం

అగ్గి పెట్టెలను వరుసగా పేర్చి
చుకుబుకు బండిని తయారు చేసి
వీధి వీధికి గిరగిర తిప్పిన
మెట్రో రైళ్ళు అప్పటివే..


మట్టి బొమ్మలకు ప్రాణం పోసి
మర మనుషులుగా తయారుచేసి
మనిషికి సాయంనేర్పిన రోబో
చిరుప్రాయంలోనే సృష్టించినవి

సరదా ఆటలో సృజనాత్మకతకు
చిరుప్రాయంలోనే చోటిచ్చి
'ఆట, విజ్ఞానానికి బాట' అని,
శాస్త్రీయమైన దేశాన్ని నిర్మిద్దాం

– వినోద్ కుత్తుం,
పలాస, శ్రీకాకుళం జిల్లా,
9634314502.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి వరుస జవాబు మీరు రాబట్టండి చూద్దాం.



జవాబు : 109

నేను గీసిన బొమ్మ





ఆర్.అభిషేక్,
6వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అక్బర్ పేట, భూంపల్లి మం, సిద్ధిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ:
chinnaarips@gmail.com

కొత్తవాళ్లు.. నటనలో సరికొత్తదనం

స్టార్ హీరోల సినిమాలు, పెద్ద బడ్జెట్ చిత్రాలు మాత్రమే బాక్సాఫీసు వద్ద సూపర్ డూపర్ హిట్లుగా నిలుస్తాయనే అపోహ చాలామందిలో ఉండేది. గతంలో స్టార్ హీరోలు సినిమాల్లో కనిపిస్తే ఖచ్చితంగా హిట్టు అవుతాయనే అభిప్రాయం ఉండేది. పరిశ్రమలోకి వస్తున్న కొత్తతరం నటులు, నటీమణులను ఆ విషయాన్ని పటాపంచలు చేస్తూ తమ ప్రతిభతో తిరుగులేని విజయాలను సొంతం చేసుకుంటున్నారు. పాతతరం హీరోలు సైతం కొత్తవారితో పోటీపడాల్సిన ఆగత్యం నేడు చోటుచేసుకుంది. కంటెంట్, కథ బాగుంటే చిన్న సినిమాలైనా సరే సూపర్ సక్సెస్ సాధిస్తాయనే దానికి సంకేతంగా 'కమిటీ కుర్రాళ్లు, సినిమా నిలిచింది.

సరికొత్తగా 'కమిటీ కుర్రాళ్లు'

గోదావరి జిల్లాల్లో జరిగే ఓ జాతర చుట్టూ అల్లుకున్న కథ. దీనికి స్నేహం..ప్రేమ, కులాల అంతరాలు.. రాజకీయ అంశాలు జోడించి ఆహ్లాదకరమైన సినిమాగా దర్శకుడు యదు వంశీ మలిచారు. ఈ చిత్రంలో 11 మంది కుర్రాళ్లు (హీరోలు)గా నటించిన మరో కొత్త కోణం.

శివగా సందీప్ సరోజ్, సుబ్బుగా త్రినాథ్‌వర్మ, విలియంగా ఈశ్వర్, సూర్యగా యశ్వంత్ పెండ్యాల. ఇలా ఎవరికి వారే తమదైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించే ప్రయత్నం చేశారు. సాయికుమార్, గోపరాజు రమణ, కంచరపాలెం కిశోర్ వంటి నటానుభవం ఈ కథకు అదనపు బలాన్ని అందించింది. పెద్దోడుగా ప్రసాద్ బెహరా నటన అందర్నీ అలరిస్తుంది. వినోద భరిత సన్నివేశాల్లో ఎంతగా నవ్వించాడో... భావోద్వేగ భరిత సన్నివేశాల్లో అంతగా మదిని బరువెక్కించాడు. ఆగస్టు 9న విడుదలైన ఈ సినిమాకు నిహారిక కొణిదెల నిర్మాత. నిర్మాతగా ఆమెకు ఇదే మొదటి సినిమా. ఒకరిద్దరు మినహా ప్రధాన తారాగణమంతా కొత్తవాళ్లే. కథలోకి వెళ్తే గోదావరి జిల్లాల్లో జరిగే ఓ జాతర చుట్టూ అల్లుకుంది. సాంకేతిక సమాచార విప్లవం అంతగా అందుబాటులో లేని రోజుల్లో పిల్లల మధ్య స్నేహాలు, కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఎలా జీవించేవారనేది మనస్సుకు హత్తుకునేలా పట్టి చూపించారు. ఇది 80–90ల తరానికి బోలెడన్ని జ్ఞాపకాల్ని గుర్తుచేసేలా ఉంది. సంఘర్షణలు, సన్నివేశాలు, హై ఎమోషన్, మలుపులు వంటి ఘటనలను అందర్నీ ఆలోచింపజేసేలా సాగింది. దర్శకుడు గోదావరి యాసలో రాసుకున్న సంభాషణలు.. జాతర సన్నివేశాల్ని తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకునేలా సాగాయి. అనుదీప్ సంగీతం కూడా హృద్యంగా సాగింది. ముఖ్యంగా జాతర నేపథ్యంలో వచ్చే నేపథ్య సంగీతం బాణీలు వినసొంపుగా సాగాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68